ప్రజాశక్తి

Vol. 4, no. 5

(Feb. 2, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 4, no. 5

(Feb. 2, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

0-2-0 Regd. No M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 4 సంచిక 5 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ | పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసు దేవరావు | బుధవారం 2-2-44

ముస్లింలీగు - మన స్వాతంత్ర్యపోరాటం

సజ్జద్ జహీర్

చాలామంది కాంగ్రెసువాదుల అభిప్రాయమేమంటే, ముస్లింలీగ్‌గాని, లీగ్ నాయకులుగాని, తమ మతం అంటే మొండిదురభిమానంతప్ప మరొక టేదీ ప్రధానంగా యెంచరు. స్వార్థంకొరకు వారుదేశంయొక్క శ్రేయస్సును సహితం మట్టిపాల్జేయడానికి వెనుదీయరు. పాకిస్థాన్ నినాదం ఒక "స్టంటు" తప్ప మరొకటికాదు. దేశంయొక్క ఐక్యతను చీల్చడానికి సామ్రాజ్యవాదులే యీనినాదాన్ని లేవదీయించారు. మనదేశాన్ని రాజకీయంగాను, ఆర్థికంగాను, బానిసత్వంలో ఉంచడానికి సామ్రాజ్యవాదులు పన్నిన పన్నాగం, యిది. ముస్లింలీగ్‌పట్ల యిట్టి అభిప్రాయంతో ఉన్న కాంగ్రెసువాదులు ఆ సంస్థతో ఎట్టి సంబంధం పెట్టుకోకూడదని వాదించడంలో ఆశ్చర్యంలేదు.

కాని, ముస్లింలీగ్ పుట్టిన 37 సంవత్సరాలలోనూ హిందూ - ముస్లిం సంబంధా లే విధంగా పరిణామంచెందుతూ వచ్చాయో పరిశీలించినట్లయితే, ముస్లిం ప్రజలలో నానాటికీ పెరుగుతూవచ్చిన రాజకీయచైతన్యంయొక్క ప్రతిబింబమే పాకిస్థాన్ అని మనం తెలుసుకోవచ్చు. దేశమంతటా స్వాతంత్ర్య కొరకు సాగించబడినజాతీయోద్యమంతోబాటే ముస్లిం జాతుల రాజకీయ చైతన్యం కూడా వృద్ధిచెందింది.

1906 నాటి దేశ పరిస్థితి

ముస్లింలీగ్ 1906 లో స్థాపించబడింది. అప్పటికి దేశపరిస్థితి యెలాఉండేదో చూదాం. బ్రిటిషు పరిపాలన అన్ని రాష్ట్రాలలోను స్థిరపడింది. కాని, పరిశ్రమలు, వ్యాపారం, విద్య కలకత్తా - బొంబాయి - మద్రాసులలో మాత్రమే యెక్కువగా వ్యాపించాయి. ముస్లిం ప్రజలెక్కువగా నివశించే ప్రాంతాలు యింత అభివృద్ధి చెందలేదు. అట్టి రాష్ట్రాలు పంజాబు, తూర్పు బెంగాలు, పశ్చిమోత్తర పరగణాలు, సింధు, బెలూచిస్థాన్. కొన్ని చారిత్రక కారణాలవల్ల కూడా ముస్లిం ప్రజలు తమ విద్యాభివృద్ధికి ఉన్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేకపోయారు. సర్ సయ్యద్ అహమ్మద్‌ఖాన్ అంచనా ప్రకారం, 1893లో దేశంమొత్తంమీద బి.ఏ ప్యాసైన ముస్లింల సంఖ్య 546; హిందువుల సంఖ్య 4987.

ఆరోజుల్లో వోటింగు హక్కు కొద్దిమంది ఆస్తిపరులకు మాత్రమే ఉండేది. ఎన్నికలలో అభ్యర్థిగా నిలబడ్డానికి బాగా చదువుకున్న బుద్ధి కుశలులకు మాత్రమే అర్హత వుండేది.

ప్రత్యేక నియోజక వర్గాలు

ఇలాంటి పరిస్థితుల్లో మింటో-మార్లే సంస్కరణ లొచ్చాయి. ముస్లిములకు ప్రత్యేక నియోజకవర్గాలుండాలనీ (అంటే,ఎన్నికలలో ముస్లిములు ముస్లిము అభ్యర్థులకే వోటు చేయడం) శాసనసభలలో కొన్నిసీట్లు ముస్లిములకు ప్రత్యేకంగా విడిచిపెట్టాలనీ, ముస్లిం లీగుకోరింది. ఈవిధంగా మొదట హిందూ - ముస్లిం సమస్య మన దేశంలో కొన్ని చారిత్రక కారణాలవల్లనే బయలుదేరింది; సామ్రాజ్యవాదులచే సృష్టించబడిన సమస్య అనడం సరికాదు. వారు దాన్ని తమ స్వార్థంకొరకు ఉపయోగించు కొంటున్నారనే మాట నిజమే. మనంకూడా మనదేశంయొక్క అభ్యున్నతికి, స్వాతంత్ర్యసంపాదనకు, హిందూ - ముస్లిం సమస్యను పరిష్కరించుకొంటే, సామ్రాజ్యవాదుల్ని దూరంచేసి, బలహీన పరచగలుగుతాం.

1906 నాటి దేశ పరిస్థితుల్ని మనం దృష్టిలో ఉంచుకున్నట్లయితే, ముస్లిం లీగ్ కోరిన కోరిక న్యాయమైనదేనని అర్థం చేసుకోగలుగుతాం. కొత్తగా అభివృద్ధికి వస్తున్న ముస్లిం మధ్యతరగతి విద్యాధికులు ప్రత్యేక నియోజకవర్గాల ద్వారా మాత్రమే తమ సోదర ముస్లిముల్ని అభివృద్ధికి తీసుకురావడానికవకాశం ఉండేది. ముస్లిం ప్రజల శ్రేయస్సుకై పాటుపడడానికి అప్పట్లో అదే సరియైన ప్రజాస్వామ్య కోరిక: ఆర్థికంగాను, రాజకీయంగాను, వెనుకబడ్డ మన తోడి ముస్లిం దేశీయులు, పైకిరావడానికి పడే ఆరాటం, పొందే తహతహ ఆకోరికద్వారా రూపం దాల్చింది.

స్వపరిపాలనహక్కు

ముస్లింలీగ్ స్థాపించబడిన 5 సంవత్సరాలకు, అనగా 1912 లో, తన ఆశయాన్ని యీక్రిందివిధంగా నిర్వచించింది:

"బ్రిటిష్ చక్రవర్తి పరిపాలన క్రింద, దేశాని కనుగుణ్యమైన విధంగా,స్వపరిపాలన చేసుకోవడం" ముస్లింలీగ్‌యొక్క ఆశయం. ఈ ఆశయాన్నే 1905 నుండీ కాంగ్రెసు కలిగియుండేది. టర్కీని సామ్రాజ్యవాదులు విచ్ఛిన్నంచేయడంవల్ల,జార్‌చక్రవర్తి(రష్యా) పెర్షియామీద దాడి సల్పడంవల్ల, మలయాలో ముస్లింలనుభవించే బాధలనుగూర్చి తెలుసుకోవడంవల్ల, మన ముస్లింలలో కూడా సామ్రాజ్యవ్యతిరేక దృక్పధం నాటుకుంది. బాల్కన్ యుద్ధం జరిగేరోజుల్లో డాక్టరు అన్సారీ నాయకత్వాన టర్కీ కొక ముస్లిం వైద్యదళాన్ని పంపించారు.

ఈవిధంగా కాంగ్రెసుఆశయాన్నే ముస్లిం లీగుకూడాఅంగీకరించడంతో ఈరెండుసంస్థల మధ్య ఏకీభావం ఏర్పడింది. తరవాత కొన్నాళ్ళకు యుద్ధం వచ్చింది. యుద్ధఘటనలవల్ల ఈ ఐక్యత మరింత హెచ్చింది. రెండుసంస్థల నాయకులు కలిసి చాలాసార్లు సమావేశమౌతూ వచ్చారు. ఒడంబడికకు 1915 లో సంప్రతింపులు ప్రారంభమయాయి.

కాంగ్రెసు-లీగు ఒడంబడిక

చివరకు కాంగ్రెసు - ముస్లింలీగులమధ్య 1916 లో ఒడంబడిక జరిగింది. ఇండియా మంత్రిగా వున్న మాంటేగూ 1917 లో మన దేశానికి వచ్చినప్పుడు కాంగ్రెసు, ముస్లింలీగు నాయకులు ఐక్యకంఠంతో జాతీయవాంఛను తెలియజేశారు.

ఈ సందర్భంలోనే సిడెన్హాం ప్రభువు, "ప్రమాద కరమైన కుట్ర" ఒకటి జర్మన్ ఏజంట్లద్వారా ఇండియాలో కొనసాగుతూందని దుష్ప్రచార మారంభించాడు

ఈ ఒడంబడికలో ప్రధానాంశా లేమంటే- ముస్లిములందరికీ ప్రత్యేక నియోజకవర్గాలుండాలి. వివిధరాష్ట్రీయ శాసనసభలలో ఎన్ని ముస్లింసీట్లుండాలోముందే నిర్ణయించుకోవాలి. పంజాబులో సగం ఎన్నికస్థానాలు ముస్లింలకు ప్రత్యేకించాలి. బెంగాల్‌లో 100 కి 40 సీట్లు ముస్లిముల కుండాలి. కేంద్రశాసన సభలో మూడోవంతు ఎన్నికస్థానాలు ముస్లిముల కీయాలి. ముస్లిములకు సంబంధించిన ఏబిల్లు నయినా ముస్లిం సభ్యులలో ఉన్న ముప్పాతికవంతు వ్యతిరేకిస్తే, అది చట్టంగా అమలులోకి రాకూడదు.

ఈ ఒడంబడికవల్ల రెండువిషయాలు మనకు స్పష్టంగా తెలుస్తున్నాయి. మొదటిది: ముస్లిములకుమొట్ట మొదటిసారిగా పంజాబు,బెంగాల్,రాష్ట్రాలలో ఒకప్రధానమైన రాజకీయ స్థానం లభించింది. రెండోవిషయం: ఫెడరల్ రాజ్యాంగంలో చిన్నజాతులకు పెద్దజాతులతో సమానమైన హోదా యివ్వబడింది. ఎక్కువ బలంఉన్న మెజారిటీజాతులుబలహీనమైన మైనారిటీ జాతుల్ని అణచి యుంచకుండా తగిన రక్షణ ఉంటుందని స్పష్టమైన గ్యారంటీ వచ్చింది.

ఖిలాఫత్ సమస్య

ఈలక్నోఒడంబడికవల్లకాంగ్రెసు-ముస్లిం లీగ్‌ల మధ్య యేర్పడిన ఐక్యత క్రమక్రమంగా వృద్ధిచెందింది. యుద్ధం అయిపోయాక పంజాబులో జరిగిన అత్యాచారాలు, దేశంలో వ్యాపించిన ఆర్థికసంక్షోభం, రష్యావిప్లవంలో ప్రజలు పొందిన విజయం, టర్కీ సామ్రాజ్యాన్ని యితర సామ్రాజ్యవాదులు తమలోతాము పంచుకోవడం - యివన్నీ మనదేశ ప్రజలలో విపరీతమైన సంచలనాన్ని కలగజేశాయి. బ్రహ్మాండమైన ప్రజోద్యమం బయల్దేరింది. దాన్ని గాంధీజీ, మోతీలాల్ నెహ్రూ, సి. ఆర్. దాస్, వంటి కాంగ్రెసు నాయకులు, మహమ్మదాలీ, షౌకతాలీ, అబుల్ కలాం అజాదువంటి ముస్లిం లీగ్ నాయకులు, నడిపించారు.

ఈఉద్యమంలో ప్రధానమైననినాదాలు మూడు: దేశానికి స్వరాజ్యం; రౌలట్ చట్టాన్ని రద్దుచేయడం; ఖిలాఫత్, ఖిలాఫత్ అంటే, టర్కీ, సిరియా, ఈరాక్, పెర్షియా, అరేబియా, వంటి ముస్లిం దేశాలన్నింటికీ సంపూర్ణ స్వాతంత్ర్యం.

పైమూడు నినాదాలపై కాంగ్రెసు సమావేశాలు, ఖిలాఫత్ సమావేశాలు, తరచు కలిసే జరుగుతుండేవి. కాంగ్రెసు నాయకులు, లీగ్‌నాయకులు, ఒకేవేదికపై ఉపన్యసించేవారు. సహాయ నిరాకరణోద్యమంలో వేలకొద్దీ హిందువులు - ముస్లింలు కలసి పాల్గొన్నారు. ఈ ఉద్యమాన్ని కాంగ్రెసు - ముస్లింలీగ్ - ఖిలాఫత్ కాన్ఫరెన్సులు మూడూకలసి ప్రారంభించాయి; కలిసి నడిపించాయి.

ముస్లిం ప్రజాసామాన్యం ఈ విధంగా ఎందుకు పోరాటంలో పాల్గొన్నారు? వారి వాంఛలు, కోర్కెలు, ఏమిటి? మొదటికారణం, మన దేశంనుండి సామ్రాజ్యవాదాన్ని సాగనంపడం కోసం. రెండోది, ముస్లింప్రజలందరి స్వాతంత్ర్యకోసం. వారికోరిక అప్పట్లో అస్పష్టంగానే ఉన్నప్పటికీ, ముస్లిం జాతుల- మనదేశంలో ఉన్న ముస్లిం జాతులతోకూడా- స్వాతంత్ర్య సంపాదనకై వారు తహతహలాడారనే విషయం స్పష్టంగా బోధపడుతుంది.

ఈ విషయాన్ని అప్పట్లో గాంధీజీ, కాంగ్రెసు నాయకులు, చక్కగా గుర్తించడం వల్లనే: ఖిలాఫత్ సమస్యను కాంగ్రెసు కార్యక్రమంలో చేర్చడంవల్లనే సంపూర్ణమైన హిందూ - ముస్లిం ఐక్యత సమకూరింది. అందుకే సామ్రాజ్యవాదం గజగజలాడిందికూడా!

సైమన్ కమిషన్

కాని సహాయ నిరాకరణోద్యమం విఫలమయాక, ఈరెండు సంస్థలలోను చీలికలు, అనైక్యత వ్యాపించాయి. 1927 లో బ్రిటిష్ ప్రభుత్వం సైమన్ కమిషన్‌ని నియమించిన వార్త చేరగానే, దేశంఅంతటా మళ్ళీ క్రోధాగ్ని మిన్ను ముట్టింది. కాంగ్రెసు, ముస్లిం లీగ్, కూడా సైమన్ కమిషన్ నియామకాన్ని ఖండించాయి. ఐక్యతతో ప్రభుత్వ పన్నాగాన్ని యెదుర్కోడానికి మళ్ళీ సంప్రతింపులు ప్రారంభమయాయి. ముస్లింలీగ్ తరపున జిన్నా 14 అంశాలు గల ఒక ప్రణాళికను ముందుపెట్టాడు. దాన్ని ముస్లింలీగే కాకుండా ముస్లిం కాన్ఫరెన్సు, మౌలానా మహమ్మదాలీ నాయకత్వంక్రింద ఉన్న ఖిలాఫత్ ముస్లింలు, జమియత్ ఉల్ ఉలేమాలు బలపరిచారు. డాక్టరు అన్సారీ, అబుల్‌కలాంఅజాద్, మొదలైన వారు తప్ప మిగతా ముస్లిం రాజకీయ ప్రముఖులందరూ జిన్నా ప్రణాళికను అంగీకరించారు. కాంగ్రెసు తరపున నెహ్రూరిపోర్టు తయారుచేయబడింది.

నెహ్రూ రిపోర్టు

ముస్లింలీగ్ ప్రణాళికకు, నెహ్రూరిపోర్టుకు మధ్య ఏయే విషయాలలో భేదం వచ్చింది? 1928 లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఏకీభావం ఎందుకు కుదరలేదు?

దేశంలో ఏర్పడనున్న ఫెడరల్ రాజ్యాంగంలో రెసిడ్యుయరీ (మిగతా 5 వ పేజీలో)

బుధవారం ప్రజాశక్తి 2-2-44

నిషేధాలు - నిర్బంధాలు

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో దేశమంతటా మరల ప్రభుత్వ నిషేధాజ్ఞలు అవతరించాయి. మద్రాసు, బొంబాయి వంటి అడ్వయిజర్ల పరిపాలనవున్న రాష్ట్రాలలోనేగాక, మంత్రులపరిపాలనవున్న పంజాబు, సింధు రాష్ట్రాలలోకూడ స్వాతంత్ర్యదినోత్సవం అనేకచోట్ల నిషేధించబడింది. "అఖిలభారత సత్యాగ్రహ కౌన్సిల్" పేరుతో బొంబాయిలో ఒకసంస్థ ఏర్పడి, కాంగ్రెసుపేరుతో సత్యాగ్రహం కొనసాగించాలని నిర్ణయించిందని ఈమధ్య వార్తలు ప్రకటించబడ్డాయి. మద్రాసులో ఆప్రకారం ఒకసభ జరిపి కాంగ్రెసువాదులు జైలుకు వెళ్లారుకూడ. నేటి పరిస్థితులలో సత్యాగ్రహం స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు తీసుకుపోడానికి మార్గంకాదని యిదివరకనేకసార్లు మేము కాంగ్రెసుసోదరులను హెచ్చరించాము. సత్యాగ్రహం ప్రజల నెత్తిపైన మరింత నిర్బంధవిధానాన్ని తెచ్చి పెడుతుందేగాని, నేడు ప్రజలను భవించుతున్న యిబ్బందులను తీర్చజాలదని స్పష్టపరిచాము. నేడు ఏమిజరిగింది? "సత్యాగ్రహ కౌన్సిల్" తీర్మానం వంకగా తీసికొని, ప్రభుత్వం స్వాతంత్ర్యదినోత్సవాలనే నిషేధించడానికి పూనుకొంది. పోరాటవాదు లనుకొన్నట్లు వారి తీర్మానంవల్ల ప్రభుత్వంపై ఒత్తిడి కలుగలేదు. ప్రజల పౌరసత్వహక్కులపై దెబ్బతీయడానికి నిరంకుశాధికారులకు అవకాశం మాత్రం యిచ్చింది.

ఇక ఆంధ్రదేశంలో నిషేధాజ్ఞలను స్థానికాధికారులు చిత్తంవచ్చినట్లు ప్రయోగించారు. కర్నూలు, పశ్చిమగోదావరి జిల్లాలలో సభలు, ఊరేగింపులు, అన్నీ నిషేధించారు. బెజవాడలో స్వాతంత్ర్యదినోత్సవం జరుపడానికి అనుమతి నిరాకరించారు. నేటి పరిస్థితులలో సత్యాగ్రహం స్వాతంత్ర్యానికి మార్గంకాదని స్పష్టపరచుతున్న కమ్యూనిస్టుపార్టీ జరుపుతున్న స్వాతంత్ర్యదినోత్సవాలను కూడ అనేకచోట్ల అధికారులు నిషేధించారు. దేశరక్షణ, కరువునివారణ, జాతీయైక్యత, ద్వారానే మన స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు తీసుకుపోగలమని కమ్యూనిస్టులం ప్రచారం చేస్తున్నాము. అలాంటప్పుడుకూడా స్వాతంత్ర్య దినోత్సవాలను నిషేధించడంలో అర్థం లేదు. అధికారదుర్వినియోగాన్ని మాత్రమే తెల్పుతుంది. చేతికి అధికారం, నిషేధాజ్ఞలు, చిక్కాయిగదా అనే ఉబలాటంతో ప్రజాజీవితాన్నే అణచివేయడం క్షంతవ్యంకాదు.

స్వాతంత్ర్య దినోత్సవంనాటి వార్తలు చూస్తే పైవిషయం బోధపడుతుంది. కడపలో నలుగురు కామ్రేడ్స్‌ను పోలీసులు అరెస్టుచేశారు. మంగళగిరిలోనూ, ఏలూరులోనూ, భీమవరంలోనూ, తిరుపతిలోనూ యిదేవిధంగా స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంలో కమ్యూనిస్టులు అరెస్టు చేయబడ్డారు. అధికారుల సంకుచితత్వానికి, అధికార దుర్వినియోగానికి, యివి చక్కని ఉదాహరణలు. కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ సభ్యులలో బయటవున్న శ్రీమతి సరోజనీదేవి సభలలో మాట్లాడకూడదనీ, ఊరేగింపులలో పాల్గొనరాదనీ, పత్రికలకు ప్రకటనలు యివ్వరాదనీ ఇండియాప్రభుత్వం నిషేధించడంకూడ దీనినే తెలియజేస్తుంది.

కాని, ఎన్ని నిర్బంధాలు పెట్టినా, ఎన్ని నిషేధాజ్ఞలు జారీచేసినా, ప్రజల హృదయాలలో నాటుకుపోయిన స్వాతంత్ర్యకాంక్షను బ్రిటీషు సామ్రాజ్యవాదులు నిర్మూలించలేరు. నిరంకుశంగా భారతీయులపై పెత్తనం చెలాయించుతూ, ఆర్థిక దోపిడి ఫలితంగా సంపాదించిన లాభాలను కుడిచి కూర్చుని శాంతంగా సామ్రాజ్యవాదులు అనుభవించగల రోజులు గతించిపోయాయి. ప్రజాయుద్ధ అనుభవాల ఫలితంగా చైతన్యం పొందుతున్న ప్రపంచప్రజలు బ్రిటీషు సామ్రాజ్యవాదుల మోసాన్ని గుర్తించారు. ఇండియామంత్రి అమెరీకి అతని నియోజకవర్గమైన బర్మింగ్‌హామ్ ప్రజలుచేసిన పరాభవమే ఇందుకు నిదర్శనం. భారతీయులంతరూ - ఏపార్టీకిచెందినా - సంపూర్ణస్వాతంత్ర్యాన్ని కోరుతున్నారు. బ్రిటీషు సామ్రాజ్యవాదులు ఈ స్వాతంత్ర్య జ్యోతిని ఆర్పలేరు. భారతీయులం ఈ స్వాతంత్ర్యకాంక్షను నేటిపరిస్థితుల కనుగుణ్యమైన కార్యక్రమంతో సాధించపూనుకుంటే, జయించితీరుతాము. కరువునివారణకొరకు, దేశరక్షణకొరకు, జాతీయప్రభుత్వంకొరకు, ప్రజాఐక్యతను నిర్మించుదాం. ముస్లింజాతుల స్వయంనిర్ణయహక్కును అంగీకరించి, కాంగ్రెసునాయకుల విడుదలకు కృషిచేద్దాం. అపుడే నిరంకుశాధికారుల పరిపాలనకు స్వస్తి చెప్పగల జాతీయప్రభుత్వాన్ని సాధించగలుగుతాము.

7 వ ఆంధ్రరాష్ట్ర ప్రెస్‌వర్కర్సు యూనియన్ మహాసభ

ఫిబ్రవరి 13, 14 తేదీలలో బెజవాడలో జరుగును

అధ్యక్షులు:
కామ్రేడ్ సి. వి. కె. రావ్
ఆంధ్రరాష్ట్ర
ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు

ప్రారంభకులు:
కామ్రేడ్ టి. పోతరాజు
బెజవాడ పట్టణ కమ్యూనిస్టుపార్టీ
సెక్రిటరీ

అన్ని పట్టణములనుంచి ప్రతినిధులందరు వచ్చి పాల్గొని మహాసభను జయప్రదము చేయగోరుచున్నాను.

యస్. సోమేశ్వరరావు, (కార్యదర్శి)

★ మన రాజకీయాలు

బ్రిటన్‌లో స్వాతంత్ర్య దినోత్సవం

— మద్దుకూరి చంద్రశేఖరరావు

లండనులో ప్రకటించబడే 'క్రిస్టియన్ వరల్డ్' అను పత్రిక భారత నాయకులను విడుదల చేసి, రాజకీయ ప్రతిష్టంభన పరిష్కరించాలని సంపాదకీయం వ్రాసింది. 44 వేల కార్మికుల ప్రతినిధులు లండనులో సమావేశమయ్యారు. ఈ సభలో పార్లమెంటు సభ్యులగు డి. యన్. ప్రిట్, సోరెన్‌సేన్, ఉపన్యసించారు. సోరెన్‌సేన్ భారతదేశంలో వ్యాపించివున్న కరవును వివరించారు. కాంగ్రెసుతో రాయబారాలు సాగించాలనీ, జాతీయప్రభుత్వం స్థాపించాలనీ, తెలిపారు. హిట్లరుఏ జంటగు మాస్లేను వదలి దేశభక్తుడైన నెహ్రూను యింకా జైలులో వుంచిన ప్రభుత్వ చర్యను నిరసించారు. తరువాత డి. యన్. ప్రిట్ మాటాడుతూ ఇండియా సరిహద్దునే జపాన్ వేచివున్న సమయంలో భారత ప్రజలలో అసంతృప్తి ప్రబలి వుండుటవల్ల వున్నప్రమాదాన్ని స్పష్టపరచాడు. భారతీయులు ప్రజాప్రభుత్వాన్ని కోరుతున్నారన్నాడు. ఈసభలో భారతదేశానికి ఆహారపదార్థాలు, మందులు విరివిగా సప్లయిచేయాలనీ, నాయకులను విడుదల చేసి జాతీయప్రభుత్వాన్ని స్థాపించాలనీ తీర్మానించబడింది.

బర్మింగ్‌హామ్ నగరంలో భారతస్వాతంత్ర్యవారం జరుపబడింది. సమావేశానికి హారింగ్టన్ ప్రభువు అధ్యక్షత వహించాడు. అమెరీని పార్లమెంటుకుఎన్నుకొన్న నియోజకవర్గంఇదే. ఇక్కడే ప్రజలుభారత స్వాతంత్ర్య దినోత్సవం జరపడంలోవున్న ప్రాముఖ్యతను వివరించాడు. భారత ప్రజల దారిద్ర్యం తొలగాలంటే, భారతీయుల ప్రభుత్వం ఏర్పడాలన్నాడు. రచయిత ఎడ్వర్డుథామ్సన్ భారత నాయకులకు బాధ్యత అప్పగించాలని తెలియజేశాడు. ఇతర ఉపన్యాసకులు అమెరీని ఇండియామంత్రి పదవినుంచి తొలగించాలన్నారు.

ఈ విధంగా బ్రిటిషు ప్రజలు భారత ప్రజల స్వాతంత్ర్యానికి తమ సుముఖతను తెలియజేస్తున్నారు. భారత రాజకీయ ప్రతిష్టంభనను పరిష్కరించాలని తమ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు.

మన దేశంలో

శ్రీనివాసశాస్త్రిగారు ఈమధ్య బెంగుళూరులో మాటాడుతూ, నాయకుల విడుదల కొరకు ఆందోళన చేయడం జాతీయ పత్రికలన్నిటి కర్తవ్యమన్నాడు. ప్రజలందరం ఐకమత్యంతో కోరితే ప్రభుత్వం లొంగక తప్పదన్నాడు. నాయకుల విడుదల కోరడమంటే భారత స్వాతంత్ర్య ఆశయాన్ని వదలుకున్నామని కాదు: రాజకీయ ఖైదీలను విడుదల చేయించడంలో జయంపొందామంటే మన గమ్యస్థానమైన భారత స్వాతంత్రంవైపు యింకో అడుగు ముందుకుపోయామన్నమాట అని తెలిపాడు.

శాసనసభ్యుల సమావేశం

జనవరి 24 వ తేదీన మద్రాసులో కాంగ్రెసు శాసన సభ్యుల సమావేశం జరిగింది. దీనికి 39 మంది హాజరయ్యారు. ఇతరులు కొందరు సభకు సందేశాలు పంపారు. సి. రాజగోపాలాచారి కూడ హాజరయి సభలో పాల్గొన్నాడు. సభలో ప్రస్తుతం దేశాన్ని ఎదుర్కొంటున్న సమస్యలను గురించిచర్చించారు. ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని లెక్కచేయకుండా, రాజకీయ ప్రతిష్టంభనను కొనసాగించడం వల్ల వచ్చిన యిబ్బందులను గురించి చర్చలు సాగాయి.

"మద్రాసు శాసనసభ్యులందరు రాజకీయ పరిస్థితులను చర్చించడానికి నెలకొకసారి సమావేశమవ్వాలని యీసభ అభిప్రాయపడుతూంది. అడ్వయిజర్ల పరిపాలన ఫలితంతా వచ్చిన సమస్యలను, ప్రజల జీవితానికి సంబంధించిన సమస్యలనుగురించి ఆ సమావేశాలుచర్చించి, తగిన చర్య తీసికొంటాయి" అనే తీర్మానం అంగీకరించబడింది. దీనిని ఆచరణలో పెట్టడానికి 9 మంది సభ్యులు కలిగిన ఒక ఉపసంఘానికి సమావేశకర్తగా కె. వెంకటస్వామినాయుడు ఎన్నుకోబడ్డాడు.

భారతశాసనసభ్యులు, రాష్ట్ర శాసనసభ్యులు - అందరూ సమావేశమవడానికి అఖిలభారత కన్వెన్షన్ ఒకటి జరుపాలనీ; దానిలో ప్రస్తుత రాజకీయ సమస్యలను చర్చించి, రాజకీయ ప్రతిష్టంభనను తొలగించడానికి మార్గాలు అన్వేషించాలనీ, కూడ తీర్మానించబడింది. ఈ రెండుతీర్మానాలుకూడ కాంగ్రెసుశాసన సభ్యులు క్రమంగా యితరపార్టీల సహకారం సంపాదించడం ఎలా అవుసమో గుర్తించుతున్నారనడానికి చిహ్నమనవచ్చు. ప్రతినెల అన్నిపార్టీలకుచెందిన శాసనసభ్యులు సమావేశమయి, ప్రజల నెదుర్కొంటున్న యిబ్బందులను పరిష్కరించడానికి పూనుకోవడం అంటే: ప్రస్తుతం దేశాన్ని ఆవరించివున్న నిస్తబ్ధత, నిస్పృహలను తొలగించడానికి ఒకమార్గం అన్నమాట. అదేవిధంగా కేంద్ర-రాష్ట్ర శాసనసభల సభ్యులందరూ సమావేశమై రాజకీయ ప్రతిష్టంభనను అంతంచేయడానికి మార్గాలు సూచింపదలపెట్టడంకూడ హర్షింపదగిన విషయమే.

సమావేశం చివరలో ఉపన్యసించుతూ శ్రీ రాజగోపాలాచారి పై తీర్మానాలను ఏకగ్రీవంగా అంగీకరించినందులకు కాంగ్రెసు శాసనసభ్యులను అభినందించాడు. "జస్టిస్ పార్టీ, ముస్లింలీగ్‌పార్టీ వగయిరా తక్కిన పార్టీల నాయకులకు నచ్చచెప్పి శాసనసభ్యుల సమావేశాలలో పాల్గొనునట్లుచేస్తే, యీ సమావేశాలకు శాసనసభలకున్న ప్రతిష్ట, అధికారం వస్తుందని" రాజాజీ ఉపన్యసించాడు. వీటిద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలనీ, నాయకుల విడుదలకొరకు, జాతీయ ప్రభుత్వంకొరకు కృషిచేయాలనీ, చెప్పాడు. దీనితోపాటు బయటవున్న కాంగ్రెసునాయకులు, శాసనసభ్యులు, ముస్లింజాతులస్వయం నిర్ణయహక్కును అంగీకరించాలి. తద్వారా కాంగ్రెసునాయకుల విడుదలకొరకు ముస్లింలీగ్‌యొక్క సహకారం సంపాదించవచ్చు. కరువునివారణ, దేశరక్షణకొరకు ప్రజలందరిని సమీకరించవచ్చు.

సరోజనీదేవి ప్రకటనలు

కాంగ్రెసు వర్కింగ్‌కమిటీ సభ్యురాలైన శ్రీమతి సరోజనీదేవి 26 వ తేదీన పత్రికా విలేఖరుల సభలో మాట్లాడారు. వర్కింగ్ కమిటీ పోరాట కార్యక్రమాన్ని గాని, సూచనలనుగానిచర్చించనేలేదని ఆమెస్పష్టపరిచారు. వర్కింగ్‌కమిటీగాని, (మిగతా 7 వ పేజీలో)

అఖిలభారత రైతుమహాసభ
మార్చి 14, 15 తేదీలలో
బెజవాడ

ది 5—2—1944 ఉదయం 9 గంటలకు బెజవాడలో ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ఆఫీసులో 8 వ అఖిలభారత రైతుమహాసభ ఆహ్వానసంఘసభ్యుల మీటింగు జరుగును. వివిధజిల్లాలలో సభ్యులుగా చేరినవారెల్లరును హాజరు కా గోరుచున్నాను.

కార్యక్రమం:— (1) కన్వీనరు రిపోర్టు (2) జమాఖర్చుల నివేదిక (3) ఆహ్వానసంఘాధ్యక్షుని, కార్యదర్శిని, కమిటీసభ్యులను ఎన్నుకొనుట (4) వివిధపనులకు ఉపసంఘముల ఏర్పాటుచేయుట (5) బడ్జెటు.

ఇట్లు,
నండూరి ప్రసాదరావు,
కన్వీనరు.

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంలో 1943 డిశెంబరు 31 లోగా చేరిన సభ్యుల సంఖ్య

జిల్లా	1943-44 సభ్యత్వం	1944-45 సభ్యత్వం	1944-45 సభ్యత్వం ఎన్ని గ్రామాలలో	రాష్ట్రసంఘ సభ్యుల సంఖ్య	అ.భా. రైతు సంఘానికి డెలిగేట్ల సంఖ్య
విశాఖ	567	3003	59	3	5
తూ. గో.	3000	8960	116	8	14
ప. గో.	4291	11300	240	11	18
కృష్ణా	24807	36600	701	36	60
గుంటూరు	11616	18181	253	13	21
నెల్లూరు	5481	9775	131	9	16
చిత్తూరు	2560	3082	66	3	5
కడప	1280	994	35	2	2
కర్నూలు	1475	6047	98	6	10
అనంతపురం	600	7958	94	7	12
బళ్ళారి	—	606	10	2	2
మొత్తం	55677	10,1501	1808	100	165

బెంగాల్ రాష్ట్రంలో ఈయేడు మొత్తం సంఖ్య 1,67,000
పంజాబు రాష్ట్రంలో 96,600

డెల్టా రైతుసంఘానికి తోడ్పడవద్దు

1941 వ సంవత్సరంలో గోదావరిడెల్టాలకు ప్రపోర్షనేట్ డిశ్చార్జి పద్ధతి, అనగా సాగునుబట్టి గోదావరి నీటిని పంచేపద్ధతి, అమలులోకి వచ్చింది. అంతకు పూర్వం పశ్చిమగోదావరి డెల్టా రైతులు అలవాటుగా పొందుచున్న నీటివసతి ప్రపోర్షనేట్ డిశ్చార్జి పద్ధతివల్ల తగ్గింది. దీనితో మన జిల్లారైతులు ఆందోళన పడసాగారు. న్యాయంగా మన డెల్టాకు రావలసిననీరు వస్తున్నదా? లేదా? అని ఆలోచించకుండా, మన డెల్టాకు రావలసిన నీరు తూర్పు - మధ్య డెల్టాలవారు అపహరిస్తున్నారనే ప్రచారం జిల్లాలో ప్రారంభమయింది. ఈపద్ధతిని రద్దుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ కొందరు పెద్దరైతులు ఆందోళన ప్రారంభించారు.

29-12-43 వ తేదీని తాడేపల్లిగూడెంలో "పశ్చిమ గోదావరి జిల్లారైతుల సమావేశం" అనే పేరుతోను; 11-1-44 వ తేదీని భీమవరంలో "కార్యనిర్వాహకవర్గం" పేరుతోను, జిల్లాలోని పెద్దరైతులు, భూస్వాములు, సమావేశమయారు. ఆ రెండు సమావేశాలకు నేనూ, మరికొందరం కలసి వెళ్ళాము. సాగునుబట్టి నీటినిపంచే పద్ధతి సరియైనదేననీ, మూడు డెల్టాలకు ఇప్పుడున్న నీటి కొరతను తీర్చుటకై ప్రభుత్వానికి ఆచరణ యోగ్యమైన సూచనల నీయడం సరియైన విధానమనీ; ప్రపోర్షనేట్ డిశ్చార్జి పద్ధతిని రద్దుచేయమని కోరడంవల్ల ఉభయజిల్లాల రైతాంగంలోను ద్వేషభావాలు రగుల్కొంటాయనీ మేమా సమావేశంలో వాదించాము. తూర్పు - పశ్చిమ గోదావరి జిల్లాల ప్రతినిధులు 4 గురు, రాష్ట్రరైతుసంఘ ప్రతినిధి ఒకరు, ఒకకమిటీగాయేర్పడి ప్రభుత్వం వద్దకు రాయబారం వెళ్ళుట మంచిదని సూచించాము. కొత్తపద్ధతి వచ్చినప్పటినుంచీ ఆకుమళ్ళకు సకాలంలో నీరురాక ఎంతెంత నష్టమవుతూన్నదీ, ఎంతెంత దాళవా సాగు అవుతూన్నదీ, నీటిసప్లయి ఎటులున్నదీ, అదనపు నీటిసప్లయికి ఏయే చర్యలు అవసరమైనదీ - వివరాలతో భోగట్టాను స్వీకరించి, యీ కమిటీ పనిచేయుట కుద్దేశింపబడింది.

కాని, మా సూచనకు పెద్ద రైతులంగీకరించలేదు. తమ భూస్వామ్య ప్రయోజనాలకు యిట్టి ప్రజాసమీకరణ, సంయుక్త కార్యాచరణ, అడ్డుగు అని భావించి, అందరినీ సమానమైన న్యాయదృష్టితో చూచే జిల్లా రైతుసంఘంలో తమకు స్థానంలేదని నిశ్చయించుకొని, 11-1-44 వ తేదీని "పశ్చిమ డెల్టా రైతుసంఘం" అనే సంస్థను ఏర్పరచారు.

పశ్చిమ గోదావరిజిల్లా రైతుసంఘం 1931 లో స్థాపించబడి, నాటినుండి నేటివరకు జిల్లా రైతులశ్రేయస్సుకై తీవ్రంగా కృషిచేస్తూంది. కాళీపట్నం - బోగోలు జమీందారీ రైతుల పోరాటాన్ని నడిపింది. జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో రైతులపై విధించబడిన పెనాల్టీలు తగ్గినాయి. మరికొన్ని ప్రాంతాలలో ఇరిగేషన్ సౌకర్యా లేర్పడ్డాయి. కానూరు, పెండ్యాల స్కీములకై ఆందోళనచేసి, ప్రభుత్వం పూనుకునేటట్లు చేయగలిగింది. 3040 యకరాల భూమి కొత్తగా సాగులోనికి తీసుకురాగలిగింది. ఎరువులకై వేలకొలదిరూపాయలు ప్రభుత్వంచే అప్పుగా యిప్పించింది. ఈకృషి ఫలితంగా, నేడు 7 తాలూకాలలో షుమారు 11000 మంది రైతులు జిల్లా సంఘంలో సభ్యులుగా చేరారు.

ఇట్టి సంఘానికి వ్యతిరేకంగా మరొక పోటీసంఘాన్ని పెట్టడంఅంటే, రైతాంగంలో చీలికలు పెట్టడం అన్నమాట. జిల్లారైతులు యీవిషయాన్ని గమనించి, మూడుడెల్టాలకు యేర్పడిన నీటికొరతను తీర్చుటకై జిల్లా సంఘాన్ని ఇంకా యెక్కువగా బలపరచవలసిందని కోరుతున్నాను పోటీసంఘాలకుతోడ్పడవద్దు.

ఇట్లు
పేటేటి వెంకటరత్నం;
అన్నే వెంకటేశ్వర్రావు.
(ప. గో. జిల్లారైతుసంఘఅధ్యక్ష, కార్యదర్శులు)

★

ఖమ్మంమెట్టు తాలూకాలో తిండిదొంగల విజృంభణ

నిజాం ప్రభుత్వంవారు ఆహారపదార్థాలకు కంట్రోల్‌రేట్లను ప్రకటించగానే, మార్కెట్లో ధాన్యం మాయమయాయి. తిండిదొంగలు ప్రభుత్వ నిబంధనలను ధిక్కరించి, రహస్యంగా విపరీతధరలకు అమ్ముతున్నారు. ఈ క్లిష్టపరిస్థితిని ఆంధ్రమహాసభ కార్యకర్తలు గుర్తించి, ప్రజాసమీకరణద్వారా మాత్రమే కంట్రోలువిధానం అమలులోకి రాగలదనీ, ప్రజలు చొరవతీసుకొని నిలవ వ్యాపారస్థులవద్దనున్న స్టాకును బయటపెట్టించాలనీ, ప్రచారంచేశారు. 19-1-44 తేదీ రాత్రి ఒక బండిమీద మూడుకిరసనాయిలు డబ్బాలు, 7 మణ్ళ బెల్లం రహస్యంగా తీసుకొని వెళ్తూంటే, వాలంటీర్లు వారిని పట్టుకొని, పోలీసులకు వప్పజెప్పారు. వీటితోపాటే మరో రెండుబళ్ళనుకూడా పట్టుకున్నారు. ఈ రీతిగా ఇటీవల పట్టుబడ్డ సరుకు 71 మణుగుల బెల్లం, 15 బస్తాలజొన్నలు, ప్రజాసామాన్యానికి కంట్రోలు ధరల ప్రకారం అమ్మబడింది.

బాపట్ల తాలూకాలో ఎరువుల అమ్మకం

బాపట్లతాలూకాలో ఉన్న సముద్రప్రాంత గ్రామాలకు అమోనియాను విరివిగా సప్లయి చేయించాలని తాలూకా రైతుసంఘం గావించిన ఆందోళన ఫలితంగా, ఈ మధ్య ప్రభుత్వం ఒకవాగను ఎరువును సప్లయిచేసింది. రైతుసంఘ వాలంటీర్లు ఈయెరువును సక్రమ పద్ధతిలో రైతుల కందించేటట్లు కృషిచేశారు. వ్యవసాయశాఖవారు అనేక ఆటంకాలు పెట్టినప్పటికీ, రివెన్యూఉద్యోగుల సహకారంతో 100 బస్తాల అమోనియా, 700 బస్తాల మిక్శ్చరు, రైతులకు పంచిపెట్టబడింది. చినగంజాంలో 1000 మందికి, బాపట్లలో 1000 మందికి, వేటపాలెంలో 500 మందికి అందజేయగలిగారు.

చీపురుపల్లి తాలూకాలో ఎరువుల సప్లయి

విశాఖపట్నం జిల్లాయందలి చీపురుపల్లి తాలూకాలో, తాలూకారైతుసంఘం చేసిన ఆందోళనఫలితంగా ఎరువులనిమిత్తం రు 30 వేల రూపాయలు రైతులకు అప్పుగా యివ్వబడింది (వడ్డీలేకుండా). ఒక్కొక్క రైతుకు రు 50 మొదలు రు 75 వరకు వచ్చింది. ఇంతేగాక, రు. 1500 విలువగల విత్తనాలు ఉచితంగా బీదరైతులకు పంచబడ్డాయి. ఇటీవల తుపానువల్ల యిండ్లు చెడిపోయిన వారికి 10—15 వేల వెదుళ్ళ వరకు వచ్చాయి. తాలూకా రైతుసంఘం 1000 మంది సభ్యత్వంతో, 25 గ్రామ సంఘాలతో, దినదినాభివృద్ధి చెందుతోంది.

రైతుసంఘాలనిధికి వరికోత

వెంకటగిరి తాలూకా మన్నూరుగ్రామంలో 15 గురు రైతు యువకులు కలిసి తమ రైతుసంఘ నిధికై ఒక రైతుచేలో వరికోత, మరొకరిచేలో కట్టివేత, ఇంకొకరిచేలో పిడివేటు వేసి, మొత్తం రు. 15 సంపాదించారు.

ఇలాగే, గుంటూరుజిల్లా వేటపాలెంలో రైతుయువకులు తమ రైతుసంఘ నిధికై 5 యకరాల వరికోతకోసి, రు. 20 సంపాదించారు.

వేటపాలెం పట్టణ యువజనసంఘ నిధికిగాను చేనేత యువకులు, స్త్రీలు, పడుగులు కట్టి, రు. 10 సంపాదించారు.

★

గుంటూరు పొగాకు మార్కెటింగు కమిటీ ఎన్నికలకు జిల్లా రైతుసంఘం అభ్యర్థులను నిలుపుతుంది

గుంటూరుజిల్లా పొగాకు మార్కెటింగు కమిటీ ఎన్నికలు సమీపిస్తున్నవి. ఓటర్ల లిస్టులు ప్రకటించబడినవి. గుంటూరు జిల్లా రైతుసంఘం యీ ఎన్నికలలో తమ అభ్యర్థులను నిలిపి రైతుహక్కులను రక్షించ తీర్మానించింది. అభ్యర్థులను నిర్ణయించడానికి శ్రీ కొల్లా వెంకయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, రావి చినఅమ్మయ్య, మొత్తల అమరారెడ్డి, మాదల నారాయణస్వామిగార్లుగల "ఎన్నికోపసంఘాన్ని" నియమించింది.

ఈ మార్కెటింగు కమిటీలో పొగాకు ఉత్పత్తిదారుల ప్రతినిధులు 4 గురు, లైసెన్సుదారుల ప్రతినిధులు 3 గురు, స్థానిక సంస్థల ప్రతినిధిఒక్కరూఎన్నుకోబడవలసియున్నది. మరొక సభ్యుణ్ణి ప్రభుత్వం నియమిస్తుంది. మార్చి 20 వ తేదీన ఎన్నికలు జిల్లాఅంతటా జరుగనున్నవి. అభ్యర్థులు నామినేషన్‌లు ఫిబ్రవరి 15 న దాఖలు చేయవలసియున్నది. కావున జిల్లారైతుసంఘ అభ్యర్థులుగ నిలువదలచినవారు ఫిబ్రవరి 5 వ తేదీ లోగా సంఘ కార్యాలయానికి రు 5 లు దరుసుముతో దరఖాస్తు చేయవలెను.

కొల్లా వెంకయ్య,
అధ్యక్షుడు, గుంటూరుజిల్లా రైతుసంఘం

లెనిన్ దినోత్సవం ★ బాలబాలికలకు

లెనిన్ దినోత్సవం

జనవరి 21 తెల్లవారుఝాము. ఏలూరులో పదిపేటలలో ప్రజలు ప్రభాతఫేరీలకు నిద్ర మేల్కొన్నారు. కళ్ళు తెరచిచూచే సరికి నగరంలో ఎటుచూచినా ఎర్రజండాలే. వివిధ పేటలలో ఆనాడు 500 రైతు-కూలీ ఎర్రజండాలు లెనిన్ దినోత్సవాన్ని చాటాయి. ఏ పేటలో విన్నా కార్మిక, విద్యార్థి, యువజన, స్త్రీ దళాల సందడే.

లెనిన్ దినోత్సవం ప్రారంభమయింది. ప్రభాతఫేరీలనుండి దళాలన్నీ తిరిగి వచ్చి 7 గంటలకు పార్టీ ఆఫీసు చేరుకున్నాయి. విజయనినాదాలతో ఎర్రజెండా ఎగురవేశారు. పార్టీసభ్యులందరూ పార్టీ ప్రతిష్ఠను కాపాడడానికి దీక్షబూనారు.

మధ్యాహ్నం గం 4 లకు బ్రహ్మాండమైన ఊరేగింపు బయలుదేరింది. 8 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పుగల లెనిన్ చిత్రాన్ని పదిజతల ఎడ్లను పూన్చిన రథంపై ప్రతిష్ఠించి, బ్యాండు వాయిద్యాలలో ఊరేగింపు బయలుదేరింది. పురవీధులన్నీ తిరిగి ఊరేగింపు సాయంత్రం గం 7 లకు బహిరంగసభ స్థలాన్ని చేరుకుంది. ఆస్థలం వేయిమంది ప్రజలతో నిండిపోయింది. వందమంది స్త్రీలు వచ్చారు. డాక్టరు రాంబాబు లెనిన్‌కి జోహారులిస్తూ గీతం చదివారు. కంభంపాటి సత్యనారాయణ (జూనియర్) మొదలైన ప్రముఖులు ఉపన్యసించారు. చివరకు, సభకు వచ్చిన వారందూ వీరలెనిన్‌కు, రెడార్మీకి జోహారు లిచ్చారు. అందరూ ఆహారకమిటీలో చేరుతామని, జూట్‌మిల్లునుండి అక్రమంగా తొలగించబడ్డ కార్మికులకు సహాయం చేస్తామనీ, ప్రతిజ్ఞతీసుకున్నారు.

ఏలూరు తాలూకాలో

ఏలూరు తాలూకాలో అనేక ప్రాంతాల్లో లెనిన్ దినోత్సవం ఎంతో ఉత్తేజకరంగా జరిగింది. పోతునూరులో బాలసంఘంవారు గ్రామాన్ని సుత్తీకొడవలి ముగ్గులతోను, కమ్యూనిస్టు నినాదాలతోను అలంకరించారు. 13 జతల ఎడ్ల నమర్చిన బండిమీద లెనిన్ పటాన్నుంచి, వివిధ ప్రజాసంఘాల సభ్యులు వెంటరాగా ఊరేగింపు జరిగింది. బాలసంఘం కోలాటం వేస్తూ ఊరేగింపులో పాల్గొంది.

దెందులూరులో 20 జతలఎడ్ల రథంతో ఊరేగింపు జరిపారు. స్త్రీలు, బాలబాలికలు గ్రామాన్ని ముచ్చటగా అలంకరించారు.

నాయుడుగూడెంలో 20 ఎడ్ల రథంతో ఊరేగింపు జరిగింది. ఊరేగింపు పెదపాడు, నాయుడుగూడెం, పాతపెదపాడు, రాజుపేట గ్రామాలగుండా సాగింది. సాయంకాలం నాయుడుగూడెంలో బహిరంగసభ జరిగింది.

అప్పారావుపాలెం, అలుగులగూడెంలలో కూడా ఉత్సాహకరంగా ఉత్సవం జరిగింది.

తూ. గోదావరి జిల్లాలో

రాజమండ్రిలోకూడా ప్రభాత ఫేరీలతో లెనిన్ దినోత్సవం ప్రారంభమైంది. సాయంత్రం జరిగిన బహిరంగసభలో - 'కష్టజీవుల పార్టీఅయిన కమ్యూనిస్టుపార్టీ నిధికి ఒకరోజు కూలీ ఇవ్వాల'ని జట్టు కార్మికుడు వంగా సూరన్న తెచ్చిన తీర్మానాన్ని అందరూ అంగీకరించారు.

విశాఖజిల్లాలో

అనకాపల్లి (విశాఖజిల్లా)లో లెనిన్ దినోత్సవంనాడు స్థానికపార్టీ ఆఫీసులో జరిగిన సభకు స్థానిక కాంగ్రెసుప్రముఖులు శ్రీసోమరాజుగారు అధ్యక్షతవహించారు. కె. గోవిందరావు లెనిన్ జీవితాన్ని, రష్యన్‌వీరుల త్యాగ సాహసాలను వివరించారు. విశాఖజిల్లాలో చీపురుపల్లి తాలూకాలో, చీపురుపల్లి, గురివిందాడ అగ్రహారం, దావెంరాజు అగ్రహారాల్లో లెనిన్ దినోత్సవం జరిపారు.

కృష్ణాజిల్లాలో

కృష్ణాజిల్లాలో అనేక ప్రదేశాల్లో లెనిన్‌డే ఉత్సాహకరంగా జరిగింది. కైకలూరు తాలూకా చిగురుకోటగ్రామంలో ఊరేగింపు జరిపి, నాల్గు ప్రదేశాలలో వీధి మీటింగులు జరిపారు. లెనిన్ చరిత్ర, రెడార్మీ విజయాల ప్రాముఖ్యతగురించి ప్రజలకు వివరించారు. తాలూకాలో మరికొన్ని గ్రామాల్లో మొత్తం 500 పురుషులకు, 200 స్త్రీలకు లెనిన్ దే సందేశాన్ని అందజేశారు.

తిరువూరులో రాత్రి ఊరేగింపుజరిగింది. తరువాత షేక్ అనూర్‌సాహెబ్‌గారి అధ్యక్షత కింద సభజరిగింది. వందమది స్త్రీలకు, 250 మంది పురుషులకు లెనిన్ జీవిత సందేశాన్ని అందజేశారు.

తిరువూరు తాలూకా గంపలగూడెంలో కూడా లెనిన్ దినోత్సవం జరిగింది.

పెడన(బందరుతాలూకా)లో వార్త నాగేశ్వరరావుగారి అధ్యక్షతను లెనిన్‌డే జరిగింది. వైజ్ఞానికదళం, కష్టజీవి, బుర్రకథ చెప్పారు.

బెజవాడ పట్టణంలో లెనిన్ దినోత్సవం జరిగింది.

గుంటూరు జిల్లాలో

గుంటూరు తాలూకా వెలగపూడి గ్రామంలో లెనిన్‌డే నాడు రాత్రి బహిరంగసభ, వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిగాయి. రైతులు, కూలీలు 150 మంది వచ్చి, లెనిన్ జీవిత సందేశాన్ని, రైతుసంఘాల పాత్రను గురించి విన్నారు. బాపట్లతాలూకాలోని వేటపాలెంలో ఉత్సవంజరిగింది.

ఇతరచోట్ల

నెల్లూరులో వత్తేఖానుపేటలోను, తోటపాలెంలోను లెనిన్‌దేనాడు సభలు జరిగాయి. ఈరెండిటిలో 150 మంది పాల్గొన్నారు.

కర్నూలుజిల్లాలో వెలుగోడులోను, తుగ్గలిలోను లెనిన్ దినోత్సవాలు జరిగాయి.

కార్మికులు ప్రత్యేకంగా

కార్మిక, కర్షకులకు ప్రియతముడు లెనిన్. లెనిన్ దినోత్సవం ముఖ్యంగా కార్మిక, కర్షకుల పండుగరోజు.

ద్రోణాచలంలో యం. యస్. యం., నైజాంరైల్వే కార్మికులు, బాలసంఘంవారు, కలిసి 20 వ తేదీ సాయంత్రం, 21 వ తేదీ ఉదయం పట్టణమంతా ఊరేగారు. 21 వ తేదీని పెద్ద సభ జరిపారు. సభలో కామ్రేడ్స్ మజీద్, నాగులు, మరియదాస్, లెనిన్ జీవిత ప్రాముఖ్యాన్ని వివరించారు.

రైల్వేకార్మికుల ఐకమత్యాన్ని భగ్నం చేయడానికి నియమించబడిన స్టాఫ్‌కమిటీలను వెంటనే రద్దుచేయాలని సభలోతీర్మానించారు.

బెజవాడ ఫౌండ్రీకార్మికులను నానా ఇబ్బందులపాల్జేస్తున్న చుండూరు వెంకటరెడ్డిని, మద్రాసుప్రభుత్వ లేబరు కమీషనరుని సభవారు ఖండించారు.

యం. యస్. యం. రైల్వేకార్మికసంఘ రాజమండ్రి బ్రాంచివారు ప్రత్యేకంగా లెనిన్ దినోత్సవం జరిపారు. కామ్రేడ్ పి. యస్. శర్మ లెనిన్ జీవితాన్ని గురించి ఉపన్యసించాడు. 400 కు పైగా కార్మికులు ఈసభలో పాల్గొన్నారు.

బందరులో సైంటిఫిక్ కంపెనీ కార్మికులు తమ సంఘ అధ్వర్యాన్న ఈ ఉత్సవం జరిపారు. 300 మంది కార్మికులు ఊరేగింపు జరిపారు. బహిరంగసభలో లెనిన్ జీవిత సందేశాన్ని విన్నారు. అంతేకాదు, తమ అధికారులు తమను పెడుతున్న పాట్లను ప్రజలకు తెలుపుకున్నారు. ప్రజలు తమకు అండగా నిలవాలని కోరారు.

ఉయ్యూరు పంచదార మిల్లు కార్మికులు ఎంతో ఉత్సాహంతో లెనిన్ దినోత్సవం జరుపుకున్నారు.

కరువు కాటకాలతోను, రాజకీయ ప్రతిష్టంభనతోను మనదేశం మహా క్లిష్టపరిస్థితిలో ఉంది. లెనిన్ ప్రపంచ ప్రజలకిచ్చిన జాతీయైక్యతా సందేశాన్ని మనం అనుసరించి దేశానికి శాంతి సౌఖ్యాలు కలిగించాలి.

బాలబాలికలకు

బెంగాలు కరువునిధికి మీరు చాలాచోట్ల కష్టపడి డబ్బు, బియ్యం, బట్టలు పోగుచేశారు. పత్రికలో స్థలంచాలక ప్రతిబాలసంఘం చేసిన కృషిని వేయలేదు. బెంగాలును గురించి ఆదుర్దాపడుతోంది మన ఒక్కదేశంలోనేకాదు. ఇంకా అనేక దేశాలలో ఆందోళన పడుతున్నారు ప్రజలు. అమెరికాలో బెంగాలుకు సహాయం చేయడానికి కొందరు పెద్దలు ఒక కమిటీని ఏర్పరచి డబ్బు పోగుచేస్తున్నారు. బెంగాలు కరువును గురించి పత్రికల్లో వ్రాసి ప్రచారం చేస్తున్నారు.

అమెరికాలో "న్యూయార్కు" అనే పెద్ద పట్టణం వుంది. (అమెరికా ఎక్కడ వుందో, న్యూయార్కు ఎక్కడవుందో మీ మాష్టారునో పెద్దవాళ్ళనో అడగండి.) అక్కడ ఒక అమ్మాయి ఒక పత్రికలో ఈ క్రింది ప్రకటన చదివింది. "అమెరికాలో ప్రతిబిడ్డా ఒక పాలడబ్బా పంపితే, ఇండియాలో పిల్లలు చావకండా బ్రతుకుతారు."

అమెరికాకు, కలకత్తా కొన్నివేల మైళ్ళదూరం వుంది. మన దేశంలో బాలబాలికలు ఎలా వుంటారోకూడా ఆపిల్ల ఎరిగివుండదు. అయినా ఆబాలిక, తనతోడి బాలబాలికలు మరోదేశంలో బాధపడుతున్నారంటే సహించలేకపోయింది. 4 పాలడబ్బాలు తెచ్చి యిచ్చింది. ఇలాగే మరికొన్ని పట్టణాలలోని బడిపిల్లలు, బెంగాలుకు ఆహార పదార్థాలు నిల్వవుంచిన (పాలడబ్బాలలాగా.) డబ్బాలు పోగుచెయ్యడానికి ఒక పెద్ద నుద్యమం లేవదీశారు. చూశారా ! మీ బాలసంఘం అమెరికాలో ఎంతపని చేసిందో !

ఇక మనవిషయం చూద్దాం. మన బాలసంఘాలు చాలా చోట్ల నాటకాలు, నృత్యాలు, చిత్ర విచిత్ర వేషాలు వేసి రాజకీయ ప్రచారానికి సహాయ పడుతున్నాయి. బాగానే వుంది. కొన్ని కొన్ని చోట్ల, బాలసంఘాలు ఈ విషయంలో బాగా ప్రసిద్ధి చెందాయి. వీటి అన్నిటినిగురించి వ్రాస్తే చాల అవుతుంది. కాబట్టి ఒక విషయం చెబుతాను.

తెనాలి తాలూకా రేవేంద్రపాడులో సంక్రాంతికి నాటకం, నృత్యం, వీధిభాగవతం, చిత్రవిచిత్ర వేషాలు వేసి బాలసంఘం 1000 మందిని ఆకర్షించింది. బాలసంఘ లైబ్రరీకి, పేపరుకు కొంతడబ్బు సంపాదించింది. పెద్దలు తమ పిల్లల్నికూడా బాలసంఘంలో చేర్చి ఉత్సాహ పరిచేటంతగా బాలసంఘం పనిచేసింది. కాని పాటలుపాడేటప్పుడు, ఆ పాటల గాంభీర్యం పోగొట్టగూడదు. రేవేంద్రపాడు బాలసంఘం "ఎలుగెత్తి కేకేసి" అనే పాటను "గోవిందనామాల" క్రింద మార్చారు. అది నవ్వు పుట్టిస్తే పుట్టించవచ్చు కాని, పాటలోని గాభీర్యం చెడిపోతుంది. "గోవిందనామాలకు" పనికివచ్చే కొత్తపాటలు వ్రాయించుకోవాలిగాని, ఇలా చేయకూడదు. ఇకముందు మీరెవరూ అలా చేయకండేం.

— దొడ్డమ్మ

గుంటూరుజిల్లా ప్రథమ మహిళా మహాసభ

★

ఫిబ్రవరి 9, 10 తేదీలలో

తెనాలితాలూకా కంచెర్లపాలెంలో జరుగుతుంది

★

సభాసందర్భమున ఆరోగ్యశాఖవారి మ్యాజిక్‌లాంతరు ప్రదర్శనం, శిశుప్రదర్శనం, సోవియట్ మహిళల పోష్టర్ల ఎగ్జిబిషన్, టాన్యా బుర్రకథ, నాటకం, సమిష్టిగానం, మొదలయిన వైజ్ఞానిక ప్రదర్శనములు ఏర్పరుస్తున్నాం. ఈమహాసభకు గ్రామగ్రామాలనుండి వేలకొలది మహిళలు హాజరుగావాలనీ, ప్రజలంతా విరాళాలిచ్చి సభను జయప్రదం గావించాలని ప్రార్థిస్తున్నాం.

ఇట్లు,

జిల్లా మహిళాప్రచారక కమిటీ

ముస్లిం ప్రజలలో కొత్తచైతన్యం

(1 వ పేజీ తరువాయి) అధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వానికే ఉండాలని నెహ్రూరిపోర్టు సిఫార్సుచేసింది. (రెసిడ్యుయెరీ అధికారాలంటే, కేంద్రప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకూ, నిర్దేశించబడు అధికారాలు తప్ప మిగతావన్నీ) ఇంతేకాదు, ఎన్నికలలోసమిష్టి నియోజకవర్గాలుండాలి. (అంటే, ముస్లింలు హిందువులకైనా వోటుచేయవచ్చు, ముస్లింలకైనా వోటుచేయవచ్చు, ముస్లింలకే వోటు చేయాలని నిబంధన ఉండకూడదు) ముస్లింలు మైనారిటీగా ఉండే రాష్ట్రాలలో మాత్రం వారికి కొన్నిసీట్లు రిజర్వుచేయ బడతాయి. కేంద్రశాసనసభలో మాత్రం అలా రిజర్వుచేయబడవు. అంటే కేంద్రంలో నాలుగోవంతు మాత్రమే ముస్లింలు ఉంటారన్నమాట.

ఇక, ముస్లింలీగ్ కోరిన ప్రధాన కోర్కెలేమంటే, రెసిడ్యుయెరీ అధికారాలన్నీ రాష్ట్రాలకు విడిచిపెట్టాలి. సింధు, బెలూచిస్థాన్, సరిహద్దులు-ప్రత్యేకరాష్ట్రాలుగా యేర్పడాలి. పంజాబు, బెంగాల్ రాష్ట్రాలలో ఇప్పుడున్న ముస్లిం మెజారిటీలను అలాగే ఉంచాలి. ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలుండాలి. వారి మతానికి, విజ్ఞానానికీ రక్షణలుండాలి. కేంద్రశాసనసభలో ముస్లింసీట్లు మూడోవంతుకు తక్కువ ఉండకూడదు.

స్వయంనిర్ణయహక్కు

ఈకోర్కెల సారాంశమేమిటి? స్వరాజ్యం వచ్చాక, మనదేశంలో ఎలాంటి రాజ్యాంగం ఉంటుందో నిర్ణయించడానికి ప్రజాప్రతినిధులు సమావేశమై యున్నప్పుడు ముస్లింప్రజ ముందుకొచ్చి, తమ కెలాంటి హక్కులుంటాయని అడుగుతున్నారు. సంపూర్ణస్వాతంత్ర్యం లభించిన తరవాత ముస్లిం ప్రజలకు యితర జాతులతోబాటు ప్రజాస్వామ్యసూత్రాలపై ఆధారపడే స్వాతంత్ర్యం ఉంటుందా అని ప్రశ్నిస్తున్నారు. వారి హక్కులకై ప్రత్యేక రక్షణ లీయవలసిందని కోరుతున్నారు. బలీయంగా ఉన్న ఇతరజాతులు తమను అణచిపెట్టి యుంచకుండా గ్యారంటీనిమ్మని అడుగుతున్నారు. తాముకూడా అన్ని విషయాలలోను అభివృద్ధి పొందడానికి సమాన అవకాశాలు కావాలంటున్నారు.

ఈకోర్కెలలోఅన్యాయమైనవేమిటి? ఇట్టి ప్రజాస్వామ్య స్వాతంత్ర్యం కొరకేగదా కాంగ్రెసు పోరాడింది ? ముస్లిం ప్రజలు నేడుముందుకొచ్చి ప్రజాస్వామ్య హక్కులకై ఆరాటపడటానికి చాలా వరకు కారణం కాంగ్రెసు నడిపిన జాతీయోద్యమాలేగదా : సామ్రాజ్య వ్యతిరేక పోరాటాలద్వారా ఆంధ్రులు, మహారాష్ట్రులు, కన్నడులు, మొదలైన వారిలో కొత్తజాతీయచైతన్యం బయల్దేరినట్లుగానే ముస్లిం జాతులలో కూడా వ్యాపించిన జాతీయ చైతన్యం, రాజకీయ చైతన్యం యొక్క ప్రతిబింబమేగదా :

కాని, ముస్లిం ప్రజలలో రేకెత్తిన యీ కొత్త చైతన్యాన్ని కాంగ్రెసు గుర్తించలేదు. అందువల్ల ఒడంబడిక కుదరలేదు. ఫలితం ఏమయిందంటే, 1930 - 32 సంవత్సరాలలో జరిగిన శాసనోల్లంఘ నోద్యమంలో ముస్లింలు పెద్దపెట్టునపాల్గొనలేదు. లండన్‌లో రౌండ్‌టేబిల్ సమావేశం జరిగాక ప్రభుత్వం కమ్యూనల్ ఎవార్డును ప్రవేశపెట్టింది. (అంటే ముస్లింలకు ప్రత్యేకనియోజక వర్గాలిచ్చింది) ఐక్యతకు మళ్ళీ ప్రయత్నాలు జరిగినప్పటికి ఫలించలేదు. 1937 లో కొత్తరాజ్యాంగచట్టం అమల్లోకి వచ్చింది.

ఎన్నికలు; వాటి పర్యవసానం

దానిప్రకారం దేశమంతటా ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు అభ్యర్థులకు బ్రహ్మాండమైన విజయం లభించింది. వారికి మెజారిటీ వచ్చిన రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రివర్గాలేర్పడ్డాయి. కాని, కాంగ్రెసు ఆశించినదొకటి, జరిగిందిమరొకటి. హిందూ-ముస్లిం ఐక్యత రాకపోగా, కాంగ్రెసులోనే ఉన్న ముస్లిం ప్రజాసామాన్యం క్రమక్రమంగా కాంగ్రెసునుండి దూరమైపోసాగింది. ముస్లింలీగ్ మళ్లీ బలీయమైనసంస్థగా ఏర్పడింది. అది తన ఆశయాన్ని ఈ క్రింది విధంగా నిర్వచించింది.

" దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం స్థాపించబడాలి. ప్రజాస్వామ్య సూత్రాలపై పరిపాలించబడే రాజ్యాలు అందులో భాగాలుగా వుండాలి. ముసల్మానుల హక్కులు, ప్రయోజనాలు,క్రియారూపంలో తగినంతగా రక్షించబడేటట్లు రాజ్యాంగ చట్టంలో నిబంధనలుండాలి.

అంటే, దేశస్వాతంత్ర్యాన్ని గురించి ఎత్తుకున్నప్పుడల్లా ముస్లింజాతుల స్వాతంత్ర్యంకూడా ప్రధానవిషయమేనని లీగ్ కోరుతూవచ్చిందన్నమాట. దేశంలో ముందుముందు యేర్పడబోయే ఫెడరల్ రాజ్యాంగంలో "ప్రజాస్వామ్య సూత్రాల ప్రకారం పరిపాలించబడే, రాజ్యాలు" భాగాలుగా ఉండాలని లీగ్ కోరుతోందన్నమాట.

కాంగ్రెసు మంత్రివర్గాలు అధికారంలో ఉన్నంతకాలము హిందూ-ముస్లిం సమస్య పరిష్కరించబడకపోగా, మరింత పాడుస్థితికి వచ్చింది. 1939 లో యుద్ధం ప్రకటించబడి, కాంగ్రెసుమంత్రులు రాజీనామాలు యివ్వగానే, "అబ్బ! పీడ వదలిపోయిందిరా!"అనేటట్లు దేశం అంతటా "విముక్తిదినోత్సవాలు" ముస్లింలు జరిపారు.

యుద్ధంరాగానే, దేశంయొక్క సంపూర్ణ స్వాతంత్ర్య సంపాదన జాతీయవాదులందరికీ తక్షణసమస్య అయింది.

పాకిస్థాన్ తీర్మానం

కాని, కాంగ్రెసు - ముస్లింలీగుల మధ్య 1916 లో వలె ఐక్యత రానేలేదు. కాంగ్రెసు సంపూర్ణ స్వాతంత్ర్యం, ప్రజాప్రతినిధిపరిషత్తు (అంటే, ఎలాంటి రాజ్యాంగం ఉండాలో నిర్ణయించేది, ప్రజలచే ఎన్నుకొనబడు ప్రతినిధులసభ), కావాలని కోరితే, ముస్లింలీగ్ 1940 లో పాకిస్థాన్ తీర్మానాన్ని ప్యాసు చేసింది. ఆతీర్మానం ప్రకారం ముస్లింలు మెజారిటీలోఉన్న ఏరియాలలో ముస్లింలకు స్వయంనిర్ణయ హక్కు, సర్వాధికారం, ఉండాలి. కొంతకాలం అయాక దేశానికి జపాన్‌దాడి ప్రమాదంకూడ యేర్పడింది. ప్రధాన సంస్థలైన రెండింటిమధ్య ఐక్యత మరింత అవసరమైంది. కాని, ఐక్యత కుదరలేదు. క్రిప్సు ప్రతిపాదనలు వచ్చాకకూడా ఒడంబడిక జరగలేదు. ఫలితం ఏమైందో అందరికీ తెలుసు. బ్రిటిష్ అభివృద్ధి నిరోధకులు మన ప్రతినిధులకు అధికార మీయకుండా, మొండి చెయ్యిచూపెట్టారు.

అప్పటినుంచీ పరిస్థితులు మరింత అధ్వాన్నమయాయి. దేశంలో కరువు, అంటు వ్యాధులు, వ్యాపించాయి. ఒకటి తరువాత మరొకటిగా విపత్తులు ప్రజలందరిమీద విరుచుకుపడ్డాయి. కాని, అనైక్యతవల్ల కాంగ్రెసుగాని ముస్లింలీగ్‌గాని, యీ ఆపత్కాలంలో ప్రజలకు సేవచేయలేకపోతూన్నాయి.

స్వాతంత్ర్య సాధనకుమార్గం

అయితే, ఈ ఊబినుండి బయటపడే మార్గం ఏమిటి ? మన ప్రధాన జాతీయ సంస్థలు రెండూ ఐక్యకంఠంతో జాతీయవాంఛను ప్రకటించడం ఎలాగు ?

పైవిషయాల్ని బట్టి, ముస్లింలీగు నేటివరకూ కోరుతూవచ్చినహక్కులు, రక్షణలు, సామ్రాజ్యవాదులచే ప్రోత్సహించబడ్డవికావని స్పష్టంగా తెలుసుకోవచ్చు. మనదేశంలో క్రమక్రమంగా అభివృద్ధిచెందుతూన్న ముస్లిం ప్రజల జాతీయ చైతన్యానికవి చిహ్నాలు. ప్రజాస్వామ్య సూత్రాలపట్ల వారికిగల అభిమానానికవి ప్రతిబింబాలు. వారి సామ్రాజ్య వ్యతిరేకదృక్పధానికి ప్రతిధ్వనులు. సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు దేశంలో వ్యాపిస్తూ వచ్చిన జాతీయోద్యమంయొక్క ఫలితాలే ఈ కోర్కెలు. జాతీయోద్యమాన్ని అవి ఏమాత్రం ఆటంకపరచవు. పైగా బలపరుస్తాయి.

కాబట్టి, యీరోజున కాంగ్రెసు, ముస్లింలీగు ప్రధానవిషయాలలో ఎంతో దగ్గర సంబంధం కలిగియున్నాయి.

సంపూర్ణ స్వాతంత్ర్యమే రెండు సంస్థలకు గమ్యస్థానం. స్వయంనిర్ణయ సూత్రాన్ని రెండుసంస్థలూ అంగీకరిస్తున్నాయి. వివిధ జాతులు కోరే వాంఛలను, ఆశయాలను రెండుసంస్థలు ప్రతిబింబిస్తున్నాయి.

ఈదృష్టితో కాంగ్రెసువాదులు పాకిస్థాన్ నినాదాన్ని చూచినట్లయితే; ముస్లింలీగ్‌కూడా ప్రజాస్వామ్యసూత్రాల కనుగుణ్యమైన కార్యక్రమాన్ని యిస్తూ లీగ్‌మంత్రివర్గాలద్వారా ప్రజల నిత్యజీవిత సమస్యల్ని పరిష్కరించినట్లయితే—యీరెండు సంస్థలమధ్య తప్పనిసరిగా ఐక్యత ఏర్పడుతుంది. అట్టి ఆశయసిద్ధికై ప్రతి భారతదేశభక్తుడు తన యావచ్ఛక్తినీ వినియోగించాలి. సుప్రసిద్ధ ఉర్దూకవి డాక్టర్ ఇక్బాల్ 1932 లో జరిగిన ముస్లింలీగు సమావేశానికి అధ్యక్షతవహిస్తూ చెప్పిన మాటలు యివి :

"ముస్లింజన్మభూములలో ముస్లిముల విజ్ఞానం, సాంప్రదాయాలు, స్వేచ్ఛతో అభివృద్ధి పొందడానికి హక్కును కలిగియున్నారనే సూత్రం అంగీకరించబడితే, హిందూ-ముస్లి సమస్య శాశ్వతంగా పరిష్కరించవచ్చు, అప్పుడు భారతదేశం యొక్క స్వాతంత్ర్యసిద్ధికి ప్రతిముస్లిం తన సర్వస్వాన్ని త్యజించడానికి సిద్ధంగా ఉంటాడు "

రైల్వే కార్మికుల్లో ఆందోళన

రాజమండ్రిలో రైల్వే గ్యాంగుపనివారు పూర్వం మనిషి 60 అడుగులు రైల్వే ట్రూపాకింగు, రోడ్డు ఓపెనింగు 30 అడుగులు చొప్పున చేస్తుండేవారు. ఇప్పుడు ట్రూపాకింగు 80 అడుగులు, రోడ్డు ఓపెనింగు 40 అడుగులు చేయవలసిందని అధికారులు నిర్బంధిస్తున్నారు, శక్తికి మించిన ఈపనిని కార్మికులు చేయలేకపోవడంచేత పని కుంటుపడుతూంది - పైగా నిరంకుశాధికారుల దౌర్జన్యం మితిమీరిపోతూంది. ఈ విషయం కార్మికుల్లో తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది.

ఇంతేకాకుండా - బెజవాడనుండి స్ట్రిక్టు (రైల్వే) లో అమలు జరిపిన ఆర్గనైజేషన్ స్కీం రాజమండ్రి లోకోషెడ్డులో అమలు జరపకపోవడంవల్ల కార్మికులు అనేక అన్యాయాలకు పాలవుతున్నారు. ఈ విషయమై 30—9—43 న రైల్వే కార్మిక సంఘంవారు ఏజంటువద్దకు రాయబారంవెళ్ళారు. స్కీమును వెంటనే అమలు జరుపుతానని అతను వాగ్దానం చేశాడు. కాని, ఇంతవరకు చేసినట్లు కనబడదు. ఈ విషయంకూడ రాజమండ్రి రైల్వే కార్మికుల్లో ఆందోళన హెచ్చుచేస్తూంది.

జనవరి 20 వ తేదీని లోకోకాలనీలోనూ 24 వ తేదీని రెండవవార్డులోను కార్మికులు సభలు జరిపి ఈ విషయాలను గురించి తీర్మానాలు చేశారు. కార్మికులకు ఎక్కువ పని కల్పించి నిర్బంధిస్తున్న అసిస్టెంటు ఇంజనీరు, అసిస్టెంటు వి. డబ్ల్యు. ఇన్‌స్పెక్టర్లపై వెంటనే తగిన చర్య తీసుకోవాలనీ, కార్మికులకు మామూలుపనినే నిర్ణయించాలనీ, తీర్మానించుచూ, రీ ఆర్గనైజేషన్ స్కీమును వెంటనే అమలు జరపాలని కోరారు. కిరసనాయిలు, కట్టెలు, సరిగా సప్లయిచేయించాలని కూడా కోరారు.

అధికోత్పత్తికోసం

ప్రజల నిత్య జీవితానికి అవసరమైన పరిశ్రమ లన్నిటిలోను కార్మికులు అధికోత్పత్తి కోసం కృషిచేస్తున్నారు.

రాజమండ్రి దూదిమిల్లుబాయిలరుకు రెండు మాసాల్లో లైసెన్సు అయిపోతుంది. ఈ లోగానే తగిన యేర్పాట్లు చేయకపోతే నూలు ఉత్పత్తి ఆగిపోతుంది. దీనిని కార్మికులు గుర్తించారు, ఖాళీగా పడివున్న బాయిలరును వెంటనే రిపేరు చేయించి, లైసెన్సు పొందాలని కార్మికులు యజమానులను కోరుతూ మొన్న25 వ తేదీని జరిగిన తమసంఘ కార్యనిర్వాహకవర్గసభలో తీర్మానించారు.

నూలును ఎక్కువగా ఉత్పత్తి చేయడానికి అన్నివిధాల తోడ్పడెదమని వారోతీర్మానం చేశారు. కార్మికులు వారంలో ఒకరోజు పనికి రాకపోయినంతమాత్రాన బట్వాడాలో కోతలు మానాలని, జీతాలు, కరువుభత్యం హెచ్చించాలని కోరారు. అధికోత్పత్తిపట్ల కార్మికులు చూపుతూన్న శ్రద్ధను అధికారులు గుర్తించి, వారి న్యాయసమ్మతమైన కోర్కెలను వెంటనే నెరవేర్చాలనీ, తీర్మానించారు.

(8 వ పేజీ తరువాయి) నందిగామ తాలూకాలో రెండు ప్రదేశాల్లోను, తిరువూరు తాలూకాలో గంపలగూడెంలోను సంక్రాంతి కార్యక్రమం జయప్రదంగా జరిగింది. అనేకచోట్ల ఆటలపోటీలతోపాటు ఎడ్లపందాలుకూడా జరిపారు. ఈ ప్రదేశాలన్నిటిలోను బాలబాలికలెవ్వరుకూడా కోడిపందేలకుగాని, జూదాలు చూట్టానికిగాని వెళ్ళలేదు. మొత్తం కృష్ణా జిల్లాలో 36 వేల మందిలో సంక్రాంతి కార్యక్రమ ప్రచారం జరిగింది. కోడిపందేలకు వెళ్ళేవారు 15 వేల మంది ఆటలకార్యక్రమం వైపు తిరిగారు.

గుంటూరు జిల్లాలో

రేపల్లె తాలూకాలోని కనగాలలో 13 వ తేదీనుండి 15 వ తేదీవరకు ఆటల పోటీలు జరిగాయి. ఉపన్యాస పోటీలలో బ్రాహ్మణులు, వైశ్యులు, లింగధారులు, యాదవులు, గౌడులు, ముస్లింలు పాల్గొన్నారు.

ఈ సంక్రాంతి కార్యక్రమం ప్రజలలో నూతనోత్సాహాన్ని కలిగించింది. ఇందులో గెలిచినవారికి బహుమానాలకై ప్రజలేవిరాళాలిచ్చారు. గ్రామజీవనంలో నూతన దశను ప్రారంభిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించి, ఆశీర్వదించారు.

ప్రభుత్వం జటపల్లి ప్రాజెక్టును నిర్మించాలి

— వావిలాల గోపాలకృష్ణయ్య

గుంటూరుజిల్లాలో సత్తెనపల్లి, గుంటూరు, నర్సారావుపేట, ఒంగోలు, వినుకొండ, పల్నాడు, తాలూకాలు ఆహారసంబలవిషయంలో పూర్తిగా లదుగు తాలూకాలు. సైర్లు పూర్తిగా వర్షంపై ఆధారపడి ఉన్నాయి. ఈ తాలూకాలన్నింటినీ సస్యశ్యామలంగా చేయగలిగిన ప్రాజెక్టు ఎన్నాళ్ళనుండో ఆలోచనలో ఉంది.

దీనిని కృష్ణా రిజర్వాయరు ప్రాజక్టు అని, జటపల్లి ప్రాజక్టు అని, అంటారు. దీనిని గురించి మొదట 1906 లో ప్రభుత్వంవివరాలు సేకరించడమే గాకుండా, 1914 లో కొన్ని లక్షలు వ్యయించి దిమ్మెలుకూడా కట్టారు. కాలవలకు ప్లానులువేసి, చిన్న చిన్న గుంటలుకూడా త్రవ్వారు. యుద్ధంవచ్చింది. పని ఆగిపోయింది.

సహజమగు రిజర్వాయరు

ఇది సత్తెనపల్లి తాలూకాలో మాదిపాడుకు పడమరగా రెండుమైళ్ళ దూరంలోను, కృష్ణాజిల్లా ముక్త్యాల కెదురుగా అంతేనూరంలోనూ జటపల్లి అనే కొండమోటు వద్ద ఉద్దేశింపబడింది. ఈనడుమ అధికారులు చింతపల్లి వద్దనున్న పుట్లగూడెంవద్ద ప్రాజెక్టు కట్టవలెనని ఆలోచించారు. అక్కడ ఎండాకాలంలో కూడా 63 అడుగులలోతు నీరుంటుందని అంచనా వేశారు. 1943 అక్టోబరు 22 వ తేదీని డి.పి.డబ్ల్యు.అధికారులు చూచివచ్చారు. నీరుందేమాట నిజమేగాని, లోతుఅయినందున కాలువలు త్రవ్వడం, వాటికి నీరు అందడం, చాలా ఖర్చులతో గూడినపని. అధికారుల అంచనాల ప్రకారం పుట్లగూడెంవద్ద కృష్ణవెడల్పు తక్కువకూడా. ప్రాజెక్టువల్ల ఒక లక్ష ఎకరాలకన్నా నీరు సప్లయి చేయడం కష్టమనీ, రిజర్వాయరుకువీలులేదనీ,తెలుస్తున్నది. కాని, జటపల్లివద్ద ప్రక్కనే కొండలమధ్యగా ఏర్పడిన లోయలు కొంతవరకు సహజమగు రిజర్వాయరుగా ఏర్పడి, యెంతో కలిసివచ్చేటట్లున్నది. ప్రభుత్వాధికారుల అంచనాప్రకారం, ఈప్రాజెక్టువల్ల 7 నుండి 8 లక్షల ఎకరాలవరకు నీరు సప్లయి చేయబడుతుందని తెలుస్తున్నది.

నాలుగైదు తాలూకాలకు నీరు

పుట్లగూడెంవద్ద ప్రాజెక్టు అయితే, ఒక లక్ష ఎకరాలు-అంటే సత్తెనపల్లి తాలూకాలో సగంభాగమున్నూ, గుంటూరు తాలూకాలో 20 గ్రామాలకుమాత్రమే నీరు అందివ్వగలుగుతుంది. అందువల్ల ఆహారసమస్యా పరిష్కారానికి అంత సహాయకారి అవుతుందని తోచదు. కాని జటపల్లి ప్రాజెక్టు అయితే, నాలుగైదు తాలూకాలకు, పల్నాడు తాలూకా మినహా అన్ని తాలూకాలకు, ఉపయోగపడుతుంది. కాలవలద్వారా నీరు సప్లయిచేసే పుట్లగూడెంప్రాజెక్టుకన్నా జటపల్లివద్ద రిజర్వాయరు ఏర్పరచి, ఎంతోనీరు నిలువచేసి, ఎండాకాలం - వర్షాకాలం రెండుకాలాల్లోనూ నీరు సప్లయిచేయ వీలవుతుంది. అంతేగాక, గుంటూరు పట్టణంలో నీటికరువునుపోగొట్టి, గుంటూరు అభివృద్ధికి ప్రతిబంధకంగా ఉన్న నీటిసమస్యను పరిష్కరిస్తుంది.

ప్రాజెక్టువల్ల ఉపయోగం

9—4—37 వ తేదీ 763 వ నెంబరు రివెన్యూ జి. ఒ. ప్రకారం యీ ప్రాజెక్టు గుంటూరు జిల్లా యందలి ఈ క్రింది గ్రామాలకు ఉపయోగపడుతుంది.

తాలూకా	మొత్తం గ్రామాలు	ఉపయోగపడే గ్రామాలు
ఒంగోలు	174	34
బాపట్ల	117	58
నర్సారావుపేట	115	29
సత్తెనపల్లి	135	40
గుంటూరు	116	97
తెనాలి	84	10
మొత్తం	741	218

కాని, తరువాత తెలియజేయబడిన అంచనాల ప్రకారం అదనంగా 300 గ్రామాలకు నీరు అందుబాటు అవుతుంది.

ఇందుకయే ఖర్చు

దీనికి ఖర్చు 7 లేక 8 కోట్ల రూపాయలు అవుతుందని అంనానావేశారు. ఈ 8 కోట్ల రూపాయలకు 50 సంవత్సరాల డిబెంచర్లను ప్రభుత్వ హామీతో, ప్రాజెక్టుపేర, ప్రకటించినట్లయితే, ప్రజలు తప్పకుండా దీని ప్రాధాన్యతను గుర్తించి, సులభంగా కొనగలుగుతారు. ఇన్‌ప్లేషన్ సమస్యనుకూడాపరిష్కరించవచ్చు గుంటూరుజిల్లా యందలి సహకారబ్యాంకులు, స్థానిక సంస్థలు, ధనవంతులు, రైతాంగం, డిబెంచర్లను కొనగల్గుతారు. ఈ ప్రాజెక్టు అమలులోకివస్తే, అదనంగా నీటిసప్లయిఅయి, పంట అధికం అవుతుందికాబట్టి రైతులు కూడా డిబెంచర్లను కొంటారు. తన పొలం అభివృద్ధి పొందడానికి, తన మెట్టభూమి మాగాణి కావడానికి, తనకు నికరంగా పంట పస్తుందనే హామీకొరకు. దేశానికి ఆహారపదార్థాలందజేసి కరువు సమస్యను పరిష్కరించడానికి, రైతులు వీటినికొంటారు. డిబెంచర్లపైవచ్చే లాభాలకొరకు గుంటూరుజిల్లాలోనే గాక, ఆంధ్రరాష్ట్రంలో ఉన్న కోఆపరేటివ్ బ్యాంకులు, స్థానిక సంస్థలు, కంపెనీలు, ధనవంతులు, మధ్య తరగతి కుటుంబాలు కూడా కొనడానికి శంకించరు

ప్రభుత్వం త్వరలో యీ ఉద్యమాన్ని ప్రారంభించి, ప్రజలద్వారా వచ్చే సొమ్ము సరిపోకపోతే తామే మిగతా ఖర్చును భరించి, ప్రాజెక్టు పనిని ప్రారంభించ వలసిందని కోరుతున్నాను.

ఈ ప్రాజెక్టు విషయమై గత యుద్ధానంతరం నుండి కూడా సత్తెనపల్లి తాలూకావారు ఆందోళన చేస్తున్నారు. రివెన్యూ మంత్రి ప్రకాశంగారు 1938 లో సత్తెనపల్లి వచ్చినప్పుడు తాలూకాకాంగ్రెసుసంఘం, తాలూకా రైతుసంఘంల తరఫున దీని అవశ్యకతను తెలియజేశారు. 1943 సెప్టెంబరు 19 వ తేదీన జరిగిన సత్తెనపల్లి ఆహారమహాసభలో అధికాహారోత్పత్తికి ఈ ప్రాజెక్టును తీసుకోవలెనని జిల్లా కలెక్టరు రివెన్యూబోర్డు, మద్రాసు ప్రభుత్వాలను కోరారు. ఈప్రాజెక్టు స్థలం చూడడానికి డి. పి. డబ్ల్యు. ఛీఫ్ ఇంజనీరు 1943 నవంబరు 11 వ తేదీ వచ్చినపుడు ముక్త్యాల మకాంలో సత్తెనపల్లి తాలూకా రైతుసంఘం తరఫున మెమోను యిచ్చాము. ఇది యుద్ధానంతర కార్యమని వారన్నారు. అయినా యిప్పటికే అలస్యమైపోయిన ఆహారసమస్యా పరిష్కారానికిది అత్యవసరమని వెంటనే ప్రారంభించవలెనని చెప్పాము.

స్వాతంత్ర్య దీక్ష

(కిస్మత్‌లోని 'దూర్‌హటో' పాట మాదిరి)

కనపడలేదా వీరయోధుల రక్తపతాకం
బల్లదిగో!
లేలెండి! లేలెండి! ఓ హిందూ - ముస్లిం సోదరులారా!
భారతదేశం మనదేగా ::
బక్కచిక్కిన డొక్కలతో,
చివికిపోయిన బట్టలతో,
వినబడలేదా అసువులబాపే ఆర్తధ్వానం
వీనుల మీకిల?
జపాను బాంబుల కాహుతి అయ్యే సోదరు
లంతా మనవారే - లేలెండి !!!
కరువు నివారణ మర్మముతెలియ,
దేశరక్షణ భారముబూన,
జాతీయైక్యత సాధనతప్ప రెండో
మార్గం లేదండోయి!
ఐక్యతవల్ల ప్రజాప్రభుత్వం స్థాపన
జేయగ దీక్షనుబూన - లేలెండి!

—యన్. శివరామకృష్ణయ్య.
—యం. వి. ఆచార్య.

జూట్ ఉత్పత్తిపట్ల అధికారుల నిర్లక్ష్యం

ఈ యుద్ధసమయంలో జూట్ పరిశ్రమ యొక్క ప్రాముఖ్యతను ఇదివరకే స్పష్టపరిచాము. ఆంధ్రదేశంలో చిట్టివలస జూట్ పరిశ్రమ ప్రధానమైన పరిశ్రమ.

చిట్టివలస మిల్లు యజమానులు అధికోత్పత్తి అవసరాన్ని గుర్తించినట్లు కనబడదు. 6 మాసాలనుండి ఫినిషింగ్ డిపార్టుమెంటు కార్మికులు దినానికి 5 గంటలుమాత్రమే పని చేస్తున్నారు. గోనెపట్టాలు తానులుగానే యుద్ధావసరాలకు ఎగుమతిచేయడంచేత కుట్టు పని తగ్గిపోయింది. మెషినుమీద పనిచేసే 80 మంది కార్మికుల్లో కొంతమందిని మరొక డిపార్టుమెంటుకు మార్చితే మిగతావారు హెచ్చుగంటలుచేసి తమదినబత్తేన్ని హెచ్చు చేసుకోవడానికి వీలౌతుంది; అధికోత్పత్తి సాగుతుంది అనికార్మికులు సలహా ఇచ్చారు. అధికారులు పెడచెవిని బెట్టారు.

అధికారులు నిర్లక్ష్యం ఇంతటితో ఆగలేదు. ఇదివరకు మిల్లు యజమానులు కార్మికులకు 18 శేర్లు బియ్యం సప్లయిచేస్తూ వచ్చారు. ఇది కుటుంబాని కంతటికీ చాలదు. మిగతాది మార్కెట్టులో కొనుక్కోవాలి. కేంద్రప్రభుత్వ నిర్ణయం ప్రకారంగా భీమునిపట్నంలోను చుట్టుప్రక్కల 3 మైళ్ళ ఏరియాలో రేషనింగ్ అమలుపెట్టడానికి లెక్కలు తీస్తున్నా. ఈ పద్ధతి చిటువలస, తగరపువలస, కొత్తపేట,సంతపేట మరికొన్ని చిన్న గ్రామాలనుంచి వచ్చే కార్మికులకుమాత్రమే ఉపయోగపడుతుంది. మిగతా కార్మికులకెలాంటి సదుపాయమూలేదు.

కాబట్టి మిల్లు యజమానులు అధికోత్పత్తిని దృష్టిలోపెట్టుకొని కార్మికుల ఈ క్రింది కోర్కెలను వెంటనే గుర్తించాలి.

1. ఫినిషింగ్ డిపార్టుమెంటు కార్మికుల సూచనను అమలు జరపాలి.

2. రేషనింగ్‌పెట్టని గ్రామాల్లో నివసించే కార్మికులకుకూడ కుటుంబ లెక్కలప్రకారం బియ్యం సప్లయిచేయాలి.

3. ఉదయంనుండి సాయంకాలంవరకు మిల్లులోనే పనిచేస్తూ, కార్మికులు పై డిపోలకువెళ్ళి బియ్యం తెచ్చుకోవడం కష్టం. కాబట్టి మిల్లు ఏరియాలోనే రేషన్ డిపోపెట్టి వారక్కడే తమకార్డులను రిజిష్టరు చేయించుకొనే ఏర్పాట్లు చేయాలి.

4. బియ్యం, కిరసనాయిలేకాక, విశాఖపట్టణ హార్బరు కార్మికుల కిచ్చునట్లుగా అగ్గిపెట్టెలు, నూనె, పంచదార, పప్పు, మొదలైన అవసరవస్తువులన్నీ సప్లయి చేయాలి.

కార్మికుని ఆదర్శం

మంగళగిరిలో సైదయ్య ఒక మిల్లు కార్మికుడు. నెలంతా నాగాలేకుండా పనిచేస్తే ఒక రూపాయి అదనంగా యిస్తారు మిల్లులో. జీతం తీసుకొని ఆఫీసుకు తిన్నగా వచ్చి లక్ష రూపాయల పార్టీనిధికి ఆరూపాయి యిస్తూ యీ విధంగా అన్నాడు:

'ఈ విధంగా పనిచేస్తే ఉత్పత్తి అధికమౌతుంది; నాకూ ఎక్కువ ఆదాయంవస్తుంది: పార్టీకి కొంతసహాయం చేయగల్గుతాను.'

కొత్త ప్రచురణలు

పశ్చాత్తాపం (నాటిక)	0—6—0
గుండెనిబ్బరం (కథలు)	0—8—0
బాలసంఘం పాటలు	0—2—0
ఆర్.యస్.యస్. నిజస్వరూపం	0—6—0
మనలెనిన్	0—8—0
లెనిన్ పల్లెటూరిపేదలకు	0—8—0
స్వాతంత్ర్య సంగ్రామము	0—10—0
జపాను నిజస్వరూపం	0—10—0
టాన్యా (బుర్రకథ)	0—2—0
ప్రసాదు చరిత్ర (బుర్రకథ)	0—2—0

★ యుద్ధసమీక్ష

లెనిన్‌గ్రాడ్ దిగ్బంధం అంతమొందింది

— తుమ్మల వెంకటరామయ్య

"లెనిన్‌గ్రాడ్ కోసం - ఫిరంగులు పేల్చండి! లెనిన్‌గ్రాడ్ పౌరులు ఓడ్చిన రక్తానికి - కార్చిన కన్నీళ్లకు - ప్రతీకారంగా తుపాకుల కాల్చండి!!" అంటూ సైన్యాధిపతులఆజ్ఞ. ఎప్పుడెప్పుడాయని ప్రతీకారానికి తహతహలాడుతున్న లెనిన్‌గ్రాడ్ సైనికులు ఎదురు చూస్తున్న సుదినం ఇదే. ఫిరంగుల కాల్పులతో దిక్కులు పిక్కటిల్లాయి, భూమి కంపించింది. ఫిరంగులు అగ్నివర్షం కురిపించాక, టాంకులు, కాల్బలం యుద్ధరంగంలోకి ఉరికాయి.

ఇది జరిగింది జనవరి 15 వ తేదీన. ఆనాటి నుండి నేటివరకు సోవియటు విజయరథం నల్లేరుపైబండిలా దొర్లిపోతూనేవుంది.

రెండున్నర సంవత్సరాలుగా లెనిన్‌గ్రాడ్ చుట్టూఉచ్చు బిగించి నిరంతర అగ్నివర్షంతో జర్మన్లుబాధపెడుతూవచ్చారు. గతసంవత్సరం జనవరి 19న, లెనిన్‌గ్రాడ్ ఉచ్చును ష్లుస్సెల్‌బర్గువద్ద రెడ్‌ఆర్మీభేదించింది. కొద్ది భూభాగం ద్వారా బయటి ప్రపంచంతో లెనిన్‌గ్రాడ్‌కు సంబంధంఏర్పడింది. కానిఫిన్నిష్‌కిరాతకులు, జర్మనుహంతకులు లెనిన్‌గ్రాడ్ పొలిమేరల నుండి అగ్నివర్షం కురిపించుతూనేవున్నారు. ఇలాంటిలెనిన్‌గ్రాడ్‌దిగ్బంధాన్నినాశనంచేయడానికి 15 వ తేదీన రెడ్‌ఆర్మీ పూనుకొంది. 12 రోజులలో ఆపని పూర్తిచేయగల్గింది. లెనిన్‌గ్రాడ్ దిగ్బంధం పూర్తిగా తుత్తునియలైపోయింది.

క్రాస్నోయిసెలో, రోప్షా, యురిటిస్క్, పుష్కిన్, పావ్లొవ్స్క్, మెగా, గచీనా, వాలోసోవో, టోస్నో, లుబాన్, చుడావో మొదలైన ముఖ్యపట్టణాలను - కీలక స్థానాలను - రెడ్‌ఆర్మీ పట్టుకొంది. మొత్తంమీద 700 లకు పైగా పట్టణాలకు, పల్లెలను నాజీ చెరనుండి విముక్తిగావించింది. జనవరి 14 నుండి 25 వ తేదీ లోగా లెనిన్‌గ్రాడ్ రంగంలో 10 కాల్బల గళాలను (డివిజన్లను) హతమార్చి, మరి రెండింటికి అపారనష్టం కలిగించింది. 40 వేల మంది నాజీ ఆఫీసర్లు సైనికులు హతమయ్యారు.

ఈ విజయాల ప్రాముఖ్యత ఏమిటి? లెనిన్‌గ్రాడ్ నుంచి వెళ్ళే ముఖ్య రహదారులూ, రైలుమార్గాలు, ఉత్తరం నుండి నైరుతి - దక్షిణ - ఆగ్నేయ దిశలకు నడిచాయి. దీనివల్ల జర్మను సైన్యాలకు చిక్కుఉంది. లెనిన్‌గ్రాడ్‌నుండి ఒడెస్సాకు (ఉత్తర - దక్షిణాలు) వెళ్ళే ముఖ్య రైలు మార్గంలో అనేక గళ్ళు కొట్టబడ్డాయి. అందుచే పడమరవైపు అంటే బాల్టిక్ రాష్ట్రాలకు తప్పుకోవాలనే జర్మన్లకు ముఖ్య రైలు మార్గాలిలా వుండడం ఇబ్బందికలుగజేస్తాయి. పోతే, మెగానుండి నార్వా వరకు ఒక్క ముఖ్య రైలు మార్గం మాత్రం, తూర్పునుండి పడమరకుపోతుంది. కాని, మెగా, టోస్నో, గచీనాలు రెడ్‌ఆర్మీ వశం కావడంతో ఆ మార్గం జర్మన్లకు నిరుపయోగం అయింది.

టోస్నో - చుడావోలు లెనిన్‌గ్రాడ్ - మాస్కోముఖ్య రైలుమార్గంమీదవున్నాయి. యీ రెండు వశమవడంతో, మాస్కో-లెనిన్‌గ్రాడ్‌ల మధ్య రహదారికి ఆటంకం ఏమీ లేకండా పోయింది.

రెడ్‌ఆర్మీ ఆశయం, లెనిన్‌గ్రాడ్‌కు రాకపోకలను తిరిగి నెలకొల్పడం ఒక్కటే గాదు. ఈ ప్రాంతంలోని జర్మన్లను చుట్టుముట్టి హతమార్చడం. అప్పుడే 3 లక్షల నాజీ సైనికులకు అట్టిప్రమాదం గల్గించింది. నాజీసైనికులచుట్టూ రెండు వలయాలను రెడ్‌ఆర్మీపన్నుతోంది. మొదటివలయంనుండి తప్పించుకున్నా రెండవ వలయంనుండి తప్పించుకోడానికి వీలులేకుండా రెడ్‌ఆర్మీ ఈ ఉచ్చులను బిగించుతోంది.

పారిపోతున్న నాజీసైనికులు, గచీనానుండి లూగా - ప్స్కావ్‌లమీదుగా బాల్టిక్ రాష్ట్రాలకు పారిపోవాలి. లుగాను ఒకప్రక్క గచీనా నుండి మరొక ప్రక్క నొవొగొరొడ్ నుండి చుట్టుకొస్తోంది రెడ్‌ఆర్మీ. గచీనాకు పడమట 25 మైళ్ళలో వొసొలోవోకూడ రెడ్ ఆర్మీ వశమయింది. ఇక్కడనుంచి కూడా లూగాకు రైలుమార్గంఉంది. ఆ విధంగా లూగాకు ఒత్తిడి హెచ్చింది. రెడ్‌ఆర్మీ ఆశయం, లూగాను పట్టుకోటం, నార్వానుంచి లూగావరకు ఏర్పరచుకొన్న జర్మను శ్రేణిని ఛిన్నా భిన్నంచేయడం, ఇంతేగాక అసలు నార్వా, ప్స్కావ్‌లనే పట్టుకొని రెండవ వలయంలోని నాజీలనుహతమార్చడం.

లెనిన్‌గ్రాడ్ రంగంలో అభేద్యమనుకొన్న జర్మను దుర్గాలను శ్రేణులను తుత్తునియలు చేసింది రెడ్‌ఆర్మీ. వాల్ఖావ్ రంగంలో అడవులు, సరస్సులు, మడుగులు ఆధారంగాచేసికొని కష్టపడి కట్టిన దుర్గాలన్నిటినీ రెడ్‌ఆర్మీ నేలమట్టం చేసింది. సైనిక చరిత్రలోనే



ఎన్నడూ ఎరుగని అద్భుత విజయాలను సాధించుతోంది రెడ్‌ఆర్మీ.

ఇటలీ

రోముకు దక్షణానదిగిన సైన్యాలు నెట్టునో పట్టణాన్ని రేవును వశపరచుకున్నాయి. దీనికి సమీపంలోన్ రోమ్‌కువెళ్లే రోడ్డువుంది. ఇలా ఇటలీ పశ్చిమతీరాన ఎన్నో చోట్ల మిత్ర సైన్యాలుదిగి యుండవలసింది. అలాదిగి, ప్రజలను యుద్ధంలో బాగా పాల్గొనేటట్లు చేసి యుండవలసింది. కానిఇటలీప్రజలకుప్రోత్సాహమివ్వడానికి బ్రిటిషు అమెరికా ప్రభుత్వాలు భయపడుతున్నాయి. ప్రజలకు చొరవ ఇవ్వడం వీటికి ఇష్టంలేదు. అందుకనే ఇటాలియన్ రాజును తొలగించుటలో సహాయపడలేదు. ఇటాలియన్ రాజుకు మద్దతుగానున్న బడోగ్లియోపై ఒత్తిడి తేలేదు. ఇటీవల "వార్ అండ్ వర్కింగుక్లాస్" అనే సోవియటు పత్రిక, బడోగ్లియో దక్షిణ ఇటలీలో ఫాసిస్టులను తొలగించడానికి ఎట్టి కృషీ చేయలేదని హెచ్చరించింది. నేపుల్స్‌లో ఏర్పడిన అఖిలపక్ష జాతీయకమిటీకి, ఇటలీ రాజకీయ జీవితంలో పూర్తిగా పాల్గొనే అవకాశం ఈయాలని కోరింది. గతశుక్రవారంనాడు దక్షిణ ఇటలీలో వివిధపక్షాల సంయుక్తకాంగ్రెసు ఒకటి సమావేశమైంది. దానిలోకూడ విక్టర్‌రాజును తొలగించాలని ఏకగ్రీవంగా కోరారు. జర్మను ఆక్రమిత ఇటలీలో గెరిల్లాయుద్ధం, సమ్మెలు జరుగుచున్నాయి. కాని యిటాలియన్ ప్రజల ఈ పోరాటాన్ని ఇటలీరాజు బలపరచలేదు. "యుద్ధంలో పాల్గొనుటలోగాని, ఇటలీ ప్రజల ప్రతిఘటనను బలపరచడంలోగాని, ఇటాలియన్‌రాజు, కృషిచేయలేదు." అంటూ ఒక తీర్మానంకూడ ఆకాంగ్రెస్‌లో చేయబడింది.

బ్రిటిష్, అమెరికా ప్రభుత్వాల ఉద్దేశ్యాలేమైనా, బడోగ్లియో, విక్టర్‌రాజుల కలలేమైనా, జరిగేదెరవేరవు.పొరుగునవున్న యుగోస్లావ్ ప్రజలనుండి ఇటలీ పాఠం నేర్చుకొంటుంది. రోమ్‌విముక్తితో ఇటాలియన్ ప్రజలు తమ ఐక్యతను మరింత దిట్టపరచుకొని మాస్కో-ఒడంబడికలోని సూత్రాలను అమలుపరచడానికి ప్రయత్నించుతారు. ఇటలీ ప్రజలుతమ చరిత్రలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించుతారు. 31—1—44

జోహార్, లెనిన్‌గ్రాడ్!

నికోలై టిఖనావ్

[టిఖనావ్ సుప్రసిద్ధ సోవియటు రచయిత, గత 2½ ఏళ్ళ నుండి లెనిన్‌గ్రాడ్‌లోనే నివాసమేర్పరుచుకొన్ని, లెనిన్‌గ్రాడ్ గాథలను ప్రపంచానికి చాటిన ప్రఖ్యాత కవి.]

....జర్మన్లు యుద్ధ రంగానికి వెళుతున్నారు. కాని, జర్మన్లకు ఆత్మ విశ్వాసం నశించిపోయింది. వారిలో ఎట్టి ఉత్సాహమూ కన్పించదు. చావుతప్పదురా అనుకుంటూ వారు నడిచారు. వాళ్ళని హతమార్చారు రెడ్‌ఆర్మీ సైనికులు. జర్మన్లు సర్వనాశనమయ్యారు. క్రాస్నోయిసెలో, రోప్షాలు వశమయ్యాయి. ఉత్తరంనుండి వచ్చే రోడ్డులో గండికొట్టబడింది. పీటరాఫ్‌వద్ద, అగ్ని వలయంలో జర్మన్లు చిక్కుకున్నారు.

పేటరోఫ్ మన వశం అయింది. స్ట్రెల్నా, లిగోవాలు మనచేజిక్కాయి. ఈ ప్రాంతాల నుండి జర్మన్లు మనపై ఫిరంగి గుండ్లు కురిపించడం ఇకలేదు. శాంతితో హాయిగా బ్రదికే పౌరులను దారుణహత్యలకు గురిచేయడం ఇకపోయింది. ఇవిగో లెనిన్‌గ్రాడ్‌పై అగ్నిగోళాలు కురిపించిన ఫిరంగులు. అవి మూగవడిపోయినాయి, మన చేజిక్కినాయి. వీటి యజమానులు-నాజీరాక్షసులు, అరుగో చచ్చిపడిఉన్నారు. వాళ్ళ తలలలో మన తుపాకిగుండు రంధ్రాలు చేశాయి.

ఎక్కడ వెనుదిరగడం అవసరం అవుతుందో, అక్కడే వెనుదిరుగుతానని హిట్లరు ప్రగల్భాలు కొట్టాడు. లెనిన్‌గ్రాడ్‌నుండి తిరోగమించ దలచలేదని, తిరోగమించనని డంబాలు కొట్టాడు. నిజమే. లెనిన్ గ్రాడ్‌ముందు, జర్మన్లు తిరోగమించడంలేదు. వాళ్లని పశువులను తోలినట్లు సోవియటుసైనికులు తోలుతున్నారు, లేదా నిలువున చీల్చుతున్నారు.

లెనిన్‌గ్రాడ్ పౌరుల సంతోషాన్ని నేనూహించగలను, లెనిన్‌గ్రాడ్ సైనికుల ఉల్లాసాన్ని నాభావవీధిలో చిత్రించగలను. జర్మన్ల మృత్యుఘంటారావం, వొల్ఖావ్ నదీతీరాన, ఇల్మెను సరస్సుఒడ్డున, నొవొగొరోడ్ - షిమ్స్ పట్టణాలలో, వినిపించుతోంది.

గచీనా, నొవొగొరొడ్‌లు మనకు చిక్కాయి. మనప్రాచీన నగరం ప్స్కావ్‌కు త్వరలోనే విముక్తి లభించుతుంది.

విజయం ఆనందోత్సాహం. ఎన్నాళ్లనుండో ఈఘడియకోసం వేచియున్నాం. అదిరానే వచ్చింది. మొట్టమొదటి సారిగా లెనిన్‌గ్రాడ్‌లో విజయ ఫిరంగిధ్వానాలు శీతాకాల రాత్రిని భేదించుకుంటూ పోయాయి. లెనిన్‌గ్రాడ్‌ముందు జర్మన్లు సంపూర్ణ అపజయాన్ని పొందారని లెనిన్‌గ్రాడ్‌కు సంపూర్ణ విముక్తి లభించిందని ప్రపంచానికి చాటుతూ, లెనిన్‌గ్రాడ్‌లో తిరిగి విజయధ్వానాలు సలిపే ఆ మంచిఘడియ ఎంతో దూరానలేదు.

(టాస్‌ఏజన్సీ)
23—1—43

(2 వ పేజీతరువాయి) గాంధీజీగాని, దౌర్జన్యముతోకూడిన కార్యక్రమం యిచ్చారని ఎవరయినాచెబితే,వాళ్లవట్టి అబద్దాలకోర్లు అనిఆమె తేటతెల్లంచేసింది. అరాచకచర్యలు వగైరా కార్యక్రమాన్ని రెచ్చగొట్టినవారితో కాంగ్రెసు నాయకత్వానికి ఎట్టి సంబంధంలేదనీ, ఆసంగతి ప్రభుత్వానికికూడ తెలసేవుంటాలనీ, ఆమె వాదించింది. అనగా-కాంగ్రెసు అరాజకోద్యమాన్ని ప్రోత్సహించిందనే వాదనను ప్రభుత్వం సాకుగామాత్రమే తెస్తూందని ఆమె నిరూపించింది.

అరాజకోద్యమం, విధ్వంసకచర్యలు, కాంగ్రెసు కార్యక్రమమని వాదించిన కాంగ్రెస్ సోషలిస్టులకు, రంగాముఠా నాయకులకు, ఫార్వర్డుబ్లాకువారికి, సరోజనీదేవిచేసిన పై ప్రకటన చెప్పుదెబ్బవంటిది. పై ముఠాలు తాము విధ్వంసకచర్యలను ప్రోత్సహించుతూ, అదే కాంగ్రెసు కార్యక్రమమని ప్రజలను మోసపుచ్చజూచారు. వ్యతిరేకించినవారిపై దుష్ప్రచారం చేశారు. ఈ మోసంలోపడిన కాంగ్రెసు దేశభక్తులు తమ పొరపాటును గ్రహించితే దేశానికి క్షేమకరం. కాంగ్రెసు పేరుతో విధ్వంసకచర్యలను ప్రోత్సహించిన ముఠాలకు ప్రజలలో తావులేకుండా చేయడం కాంగ్రెసువాదుల కర్తవ్యం.

నాయకుల విడుదలనుకోరడం తప్పా?

"దయతలచి నాయకులను విడుదలచేయమని కోరడం అవమానకరమైద విషయం. అట్టి మిత్రులను మావిడుదలకొరకు వాదించవద్దని నామనవి." అని సరోజనీదేవి ప్రకటించింది. ఆమె ఈ విషయంలో పొరపాటు పడింది. ఇతరపార్టీలు, నాయకులు, ప్రజలు, కాంగ్రెసునాయకుల విడుదలకోరుతున్నారు. ప్రభుత్వాన్ని వారు వినమ్రులై దయదలచి విడుదలచేయమని కోరుటలేదు. తమ దేశనాయకుల విడుదలనుకోరుట ప్రజాహక్కుగా వారు డిమాండుచేస్తున్నారు. ఇందులో తలవంపులేమీలేవు. కాంగ్రెసునాయకులను విడుదల చేయించడం భారతప్రజల కర్తవ్యం.

ఇంతేగాక సరోజిని నిష్పక్షపాతులైన బ్రిటీషు జడ్జీలముందు విచారణకు పెట్టాలని కోరింది. తను అట్టి విచారణకు నిలబడటానికి సిద్ధమని తెలిపింది. ప్రభుత్వాన్నికూడా విచారణకు పెట్టాలంది. ఇది దేశప్రజలకు ఆమె యిచ్చిన సందేశం. కాని, యిది కాంగ్రెసు నాయకులను గౌరవించే ప్రజలు ఎన్నడూ కోరరు. కాంగ్రెసునాయకులను విచారించటానికి బ్రిటీషు జడ్జీలకు ఎట్టి న్యాయమైన హక్కులేదు. విచారణ కోరడం మితవాదుల పద్ధతిగాని, ప్రజాకోరికఎన్నడూకాదు. అసలు సరోజనీదేవి ప్రకటనను బట్టి నాయకుల అరెస్టుకు తగిన కారణమేలేదు. నిష్కారణంగా డిటైను చేయబడిన నాయకులను విడుదలచేసి తీరాలని ప్రజలు ప్రభుత్వాన్ని హెచ్చరించుతున్నారు. అదేవారికర్తవ్యం.

పోలిష్ సామ్రాజ్యవాదుల నిరంకుశ పరిపాలన

●

[ఈ వ్యాసం, 1939 లో "ప్రవడా" లో యరోస్లావిస్కీ వ్రాసిన వ్యాసాన్ని ఆధారం చేసుకొని వ్రాయబడింది.]

పోలిష్ ఉపప్రధాని క్వైట్‌కోవిస్కీ, ..కసారి పోలండును ఆర్థికంగా రెండుభాగా ..ంగా విభజించాడు. రెండవభాగంలో, అసలు ..గోవియటుకు చెందినపశ్చిమయుక్రైన్, పశ్చిమ ..బైలోరష్యాలున్నాయి. మొదటి భాగాన్నంతా ..రిశ్రమలతో నింపి, రెండవ ..గాన్ని వలసదేశంగా తయారుచేశారు ..పోలిష్ సామ్రాజ్యవాదులు. ఇందుకు నిదర్శ..ం ఆయా భాగాలలోగల పరిశ్రమలనుచూస్తే ..ాలు.

బొగ్గు, ఉక్కు, ఇనుము పరిశ్రమలు ..మావత్తూ మొదటిభాగంలోనే ఉన్నాయి. ..ర్వేలు దట్టంగాఉన్న ప్రదేశం కూడాఇదే. ..క్రింది లెక్కలు మొదటిభాగం, దేశం ..మావత్తుసంపదను, ఎలా ఉపయోగించు కొం..ందో తెలియజేస్తుంది.

	పరిశ్రమలు 100 కి ఎన్ని
..విరియంత్రాలు / నీటిమార్గాలు	80
..చ్చుపరిశ్రమలు / ఆరోగ్యవిజ్ఞాన సంస్థలు	80
..ద్యుచ్ఛక్తిని వాడుకోవడం	100 కి 93
..నుము ఉపయోగించుకోవడం	.. 80
..ాఫీ, టీని ఉపయోగించుకోవడం	.. 95

వలస రాజ్యనీతి

ఇక రెండవ భాగం చూద్దాం. పోలిష్ ..పెట్టుబడి దారులు దీనిని ఒకవిధంగా తమ ..వలసదేశంగా మార్చారు. మొదటి భాగంలోని ..తమ పారిశ్రామిక వస్తువులను ఇక్కడికి ఎగుమతిచేసి, ఇక్కడ ముడి వస్తువులను దోచుకో మొదలెట్టారు. అతి చౌకగా ఆహార పదార్థాలను కొని దోపిడి చేసేవారు.

పశ్చిమ బైలోరష్యాలో, మొత్తం పోలండులో పండే బంగాళాదుంపలలో నాల్గవవంతు పండుతుంది. కాని అక్కడ బంగాళా దుంపలతో తయారుచేసే తీయని ద్రావక పరిశ్రమలను మూసివేసింది ప్రభుత్వం. ఇంతేగాక నారబట్టల పరిశ్రమల్నికూడ మూసివేసింది. పరిశ్రమలన్నిటినీ బలవంతాన మూసివేయడం వల్ల చివరకు బైలోరష్యా ప్రజలు రాటం వడుక్కొని బ్రతికే స్థితికి వచ్చారు. విల్నా ప్రాంతంలోని తోళ్ళ పరిశ్రమను మూసివేశారు. బైలోస్టాక్‌లోని బట్టల పరిశ్రమలోని కార్మికులు ఏవిధంగా తగ్గిపోయింది ఈక్రింది లెక్కలనుబట్టి తెలుస్తుంది. గత యుద్ధానికి (1914-18) పూర్వం 100 మంది కార్మికులుంటే 1929 లో 47 మంది, 1930 లో 40 మంది, 1931 లో 37 మంది మాత్రమే ఉండేవారు. ఆతర్వాత మరీ తగ్గింది ఈ సంఖ్య. ఇది ఇచ్చటి పరిశ్రమలను బలవంతాన పోలిష్ సామ్రాజ్యవాదులు ఎలా నాశనం చేశారో తెలియజేస్తుంది. పశ్చిమ యుక్రైన్, బైలోరష్యాలలోని అడవులు కొట్టివేయబడినాయి. ఫర్నిచర్ పరిశ్రమలు మూలబడ్డాయి.

రైతుల దారిద్ర్యం

ఇక పశ్చిమ బైలోరష్యాలో రైతులస్థితి ఎలావుండేది? మొత్తం పోలండు భూమిలో 100 కి 45 పాళ్లంతా 16000 పోలిష్ భూస్వాముల చేతిలో వుండేవి. ఒక్కొక్కరికి 2500 ఎకరాలకుపైగా ఉన్న భూస్వాములు 2 వేల దాకా వున్నారు. వారికి మొత్తం పోలండులోని 5వ వంతుభూమివుంది. సగటున లెక్కచూస్తే రైతు పండించే భూమి నివసించే యిల్లు 12 ఎకరాలు వుంటుంది. ఇలాంటి రైతులందరికీవున్న మొత్తం భూమికంటె రెట్టింపు పెద్ద భూస్వాముల చేతులలోనే వుంది. ఇలా భూమి అంతా కొద్దిమంది భూస్వాముల చేతిలోనే ఉంది. ఇంతేగాదు, కొన్ని చట్టాలు చేసి, మంచిమంచిభూములు భూస్వాములకు, మిలటరీ అధికారులకు వచ్చేటట్లు చేసింది పోలిష్ ప్రభుత్వం. బీద రైతులంతా పర్రి భూములకు, ఇసుకభూములకు, ఊబిప్రదేశాలకు పోవలసివచ్చింది. ప్రజలను పీడించుకొనుటకు ప్రసిద్ధిచెందిన కొందరు రాచవంశీకులకు, జమీందార్లకు వుండేభూమికి అంతులేదు. కారల్‌రాడ్జివిల్ అనే అతనికి 2 లక్షల 30 వేల ఎకరాలుండేది. లక్ష 30 వేల ఎకరాలకు పైగా ఉన్నవాళ్ళిద్దరున్నారు. దాదాపు 70 వేల ఎకరాలున్న జమీందారులు కొంతమందిఉన్నారు.

ఈ జమీందార్ల, భూస్వాముల, మిలటరీ అధికారుల, చేతులలో రైతులు పీల్చిపిప్పి చేయబడ్డారు. వీరి దరిద్రదశ మన భారతదేశ రైతులతో సమానంగావుందని, నోయెల్ బెకెట్ అనే బ్రిటిషు పార్లమెంటు సభ్యుడు చెప్పాడు.

వ్లాడిమిర్ (వొలీనియా) అనే ప్రదేశం యుక్రైన్‌లోనిది, దానిని సందర్శించి బెకెట్ ఇలా అన్నాడు: "నాకు ఇండియా విషయం తెలుసు. భారతదేశంలోదరిద్రస్థితి మీరూ విని యుంటారు. కాని పశ్చిమయుక్రైన్‌లో నేను చూచిన దుర్భరదారిద్ర్యస్థితిని ఎక్కడా చూడలేదు. పోలండ్ ఇంత సైన్యాన్ని ఎందుకు పోషించుతుందో ఇపుడు నా కర్థమైంది."

నోయెల్‌బెకెట్ 1927 లోని పరిస్థితులను చెప్పాడు. కాని తర్వాత ఈ పరిస్థితులు మరింత విషమించాయి. వొలీనియా ప్రాంత స్థులస్థితి 10 ఏళ్ళలో మరింత అధ్వాన్నమైంది. ఇదివరకు 100 శేర్లు ఉప్పువాడుకుంటే ఇప్పుడు 7 శేర్లు ఉపయోగిస్తున్నారు. అలాగే పంచదార 100 తులాలు ఉపయోగించితే 72 తులాలేఇపుడుఉపయోగిస్తున్నారు. బొగ్గు ఇదివరకటిదానిలో సగంమాత్రం ఉపయోగిస్తున్నారు. కిరోసిన్ దీపాలు ఉపయోగించడం పోయింది. ఇనుపనాగళ్ళకు బదులు కొయ్యనాగళ్లు వాడుతున్నారు.

విజ్ఞాన వినాశం

వీటి అన్నిటితో పాటు బైలో రష్యా, పశ్చిమ యుక్రైన్‌ల విజ్ఞానాన్ని ధ్వంసం చేసింది ప్రభుత్వం. పోలిష్ ప్రభుత్వం ఏర్పడినపుడు పశ్చిమ యుక్రైన్‌లో 3600 స్కూళ్ళుండేవి. 1934–35 లో 457 మాత్రం ఉన్నాయి. ఈ స్కూళ్ళలో యుక్రైన్‌భాషనుపయోగించక, పోలిష్‌భాషలో చరిత్ర, భూగోళం, మొదలైనవి నేర్పబడుతున్నాయి.

1919లో వొలీనియాలో 1050 యుక్రైన్ స్కూళ్లుండేవి. 1936 లో 5 మాత్రం ఉండేయి. మొత్తం యుక్రైన్‌లో 3000 స్కూళ్ళను పోలిష్ ప్రభుత్వం మూసివేసింది. పశ్చిమ బైలో రష్యాలో 400 మూసింది. ఈ విధంగా ఆయా జాతుల విజ్ఞానాన్ని నాశనం చేసింది. ప్రభుత్వం పోలండులో కోటి మందికిపైగా నిరక్షరాస్యులే.

బైలోరష్యాలోని, యుక్రైన్‌లోని దుర్భరస్థితినిచూచి సహించలేక 1930 లో 60 మంది బ్రిటిషులేబరుపార్టీ ప్రతినిధులు, ఇద్దరు లిబరల్సు నానాజాతి సభకు హెండర్సన్ ద్వారా ఒకపెటిషన్ పంపారు. దానిలో యుక్రైన్-బైలోరష్యాలోని 700 గ్రామాల పరిస్థితులను వివరించారు. అందులో ఇలావుంది: "వందలకొలది పురుషులను, స్త్రీలను, పిల్లల్ని కొట్టి అధికారులు చంపుతున్నారు. అనేకమంది దెబ్బల గాయాలవల్ల మరణించుతున్నారు. వేలకొలది ప్రజలను జైళ్ళలో కుక్కారు. అనేక లైబ్రరీలపైన, క్లబ్బులపైన కో-ఆపరేటివు స్టోర్సుపైన దాడిచేసి నాశనంచేశారు." ఈ విధంగా పీడించబడిన పశ్చిమ బైలో రష్యా - పశ్చిమ యుక్రైనులకు 1939 లో సోవియటు విముక్తి నిచ్చింది. తిరిగి నేడు హిట్లరు చెరనుండి తప్పించుతోంది. తమ దోపిడి విధానం తిరిగి నెలకొల్పడానికి అవకాశం పోతుందనే పోలిష్ సామ్రాజ్యవాదులు, సోవియటు విజయాలను జూచి ఈనాడింత గోలచేస్తున్నారు.

సంక్రాంతి నాడు-

నిన్నమొన్నటి వరకది కోడిపందేల దిబ్బ. ప్రతియేడూ సంక్రాంతినాడుతగవులకు, కొట్లాటలకు రంగస్థలం. రక్తపాతాలు కొత్త కాదు.

కాని, ఈ సంక్రాంతినాడో! దానిరూపు పూర్తిగ మారిపోయింది. పచ్చ తోరణాలతో చెడుగుడు కోర్టులు కనులపండువుకూర్చాయి. రెపరెపలాడే యువజనపతాకాలు హృదయాలనుర్రూత లూచాయి. ఎటుచూచినా ఐక్యతానినాదాలుఉత్తేజంకలిగించాయి. అన్నివర్గాల-కులాల యువకులు, బాలబాలికలు, "ఐక్యమై సాగుదాం" అని గొంతెత్తి పాడుతూ బారులు తీరి నప్పుడు: "ఎగురవేయ్, భారతభువిపై యువకపతాకం," అని పతాక వందనం చేసేటప్పుడు - అది మునుపటిస్థలమేనా! అనుకున్నారు వూరిపెద్దలు.

రాయలం (భీమవరం తాలూకా) లోని బాలబాలికలు, యువకులు తీసుకొచ్చినమార్పు ఇది. ప్రజల ఉత్సాహాన్ని కోడిపందేలు, తాగుడు, జూదాలు మొదలయిన చెడుమార్గాలను పట్టనీయకుండా, ఆరోగ్య కరమయిన రంగాల్లోకి మరల్చితే దేశమంతా పచ్చతోరణంగా ఉంటుందనడానికి ఇదొక నిదర్శనం. ఈనాడు నిర్మాణయుక్తంగ సంఘటిత మవుతూన్న యువజనులు, బాలబాలికలు మన సమాజంలో తీసుకొస్తున్న మార్పుల కిదొక సూచిక. ఆ ఊళ్ళో ప్రతి ఏటా వేలకొలది ప్రజలు కోడిపందేలు, జూదాల్లో పాల్గొనేవారు. ఏడు భోగినాడు 50 మంది, పెద్దపండగనాటి ఉదయం 50 మంది మాత్రమే పాల్గొన్నారు. పెద్దపండగసాయంత్రంపందెంకట్టేవారెవ్వరూ లేక, అంతా ఆటలను చూట్టానికి వచ్చేశారు.

ఒక్క రాయలంలోనేగాదు. భీమవరం తాలూకాలోని కోళ్ళపర్రు, ఎండగండి, కొందోపాడు, గుబ్బలవారిపాలెం, నవుడూరు అనేచోట్లకూడా సంక్రాంతినాడు ఇలాంటి నిర్మాణ కార్యక్రమం జరిగింది.

నూతన జీవనం

రాయలంపాడులో, పండగ నాలుగు రోజులు తాగి తందనాలాడ బయలుదేరిన 30 ఏళ్ళ ఎరుకలతను, యువకుల ఆటల పోటీలుచూచి, ఉత్సాహం పట్టలేక, తానూ పాల్గొన్నాడు. తాను ఎరుకలవాడనన్న సంగతి అతనూ మరచిపోయాడు - చుట్టుఉన్నవాళ్ళూ మరచిపోయారు. యువజనసంఘం క్షత్రియ, హరిజన, కాపు యువకుల నందరిని ఆటలకాహ్వానించి - ఐక్యత ఆదర్శాన్ని పెద్దల యెదుటబెట్టింది.

ఎండగండిలో బాలికలు ఘోషా సంకెళ్ళను తెగనరికి ఆటలపోటీల్లో పాల్గొన్నారు. అంతవరకు బయటికి వచ్చిఎరుగని మహిళలువచ్చి ఆటలుచూచారు. ఈ అభివృద్ధినిచూచి అంతా ఆశ్చర్యపోయారు.

విస్సాకోడేరులో తాగుడు, జూదం, కోళ్ళ పందెం పిశాచి బొమ్మను తయారుచేసి తగులబెట్టారు. "ఇప్పుడు దహనంచేశారు - మళ్ళా సంవత్సరం దీనికి తద్దినం పెట్టండి" అన్నాడొకతాత.

ఇలా గ్రామ జీవనంలో కొత్తదశను ప్రారంభించడమేకాదు యువజన బాలసంఘాలుసాధిస్తున్నది. ఆగస్టుఘటనల తర్వాత ప్రభుత్వ నిరంకుశ విధానానికి భీమవరం తాలూకా ఘోరంగా బలిఅయింది. అలాంటి తాలూకాలో ఆరు ప్రదేశాల్లో ఊరేగింపులు, బహిరంగసభలుజరిపారంటే, తిరిగిపౌరసత్వ హక్కులను ప్రతిష్టించారన్నమాట. ఆసభలకు అధ్యక్షత వహించిన పెద్దలు యువకుల కృషిని ఆశీర్వదించారు.

నర్సాపురం తాలూకాలోకూడా 4గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమంజరిగింది.

దివితాలూకాలో

దివితాలూకాలోని మంగళాపురంలో, సంక్రాంతి సందర్భంలో జనవరి 11 నుండి 15 వరకు ఆటల పోటీలు. వైజ్ఞానిక కార్యక్రమం చూపారు. 'సుదినం'మనే నాటకం, 'కష్టజీవి' అనే బుర్రకథలను ప్రదర్శించారు. కోడిపందేలకు, జూదాలకు పోవలసిన వేలకొలది యువకుల్ని, పెద్దవారిని ఆరోగ్యకరమైన ఈ కార్యక్రమం ఆకర్షించింది. సమాజానికి చీడపురుగులాంటి ఒక రౌడీ ఈకార్యక్రమాన్ని చెడగొట్టడానికి పన్నాగాలు పన్నాడు. ఈ కార్యక్రమానికి పోటీగా జూదం ఏర్పాటు చేశాడు. కొందరు వాడివలలోపడ్డారు. యువకులు యిది కనిపెట్టి, వాణ్ణి ప్రజల్లో బట్టబయలు చేసి, వాడివలలో పడినవారినికూడా ఆటలవైపు ఆకర్షించారు. సమాజజీవనంలో అభివృద్ధిని కలిగించేకార్యక్రమానికి ఏలాంటి అడ్డంకులున్నా ఎదుర్కొనడానికి యువకులు ఈవిధంగా దీక్షపూనారు. కుల, మత, వర్గ విభేదాలనుపాటించకుండా యువక లోకాన్ని యువజన పతాకం క్రింద సంఘటితపరుస్తున్నారు.

ఈవిధంగా దివితాలూకాలో 7 కేంద్రాల్లో సంక్రాంతి కార్యక్రమం జరిగింది.

గుడివాడ తాలూకాలో

గుడివాడతాలూకాలోని అప్పారావుపేటలో యువజన సంఘంవారు పెద్ద ఊరేగింపుతో కోడిపందేలచోటికి వెళ్ళి, అక్కడ చెడుగుడు పెట్టి ఆటలపోటీలుప్రారంభించారు. ఇదిచూచి ఉత్సాహం పట్టలేక, జూదాలాడుతున్నవారిలోంచి మూడుటీములు వచ్చి పోటీల్లో పాల్గొన్నారు. కొద్ది సేపటికి ఎక్కువమంది ఆటలవైపు తిరిగిపోయారు. ఈవిధంగా పామర్రు, వెంట్రప్రగడ, నందివాడ, ముదినేపల్లి ఫిర్కాల్లో మొత్తం 12 కేంద్రాల్లో సంక్రాంతి కార్యక్రమం జయప్రదంగా జరిగింది.

పెద్దలు ఆటంకపరచినా -

కైకలూరు తాలూకా గోపవరంలో గ్రామపెత్తందార్లు గూడెపుపెద్దల్ని పిలిచి - "మీ కుర్రాళ్ళు మా కుర్రాళ్ళతోకలిసి ఆటలాడేరంటే జాగ్రత్త!" అని బెదరించారు. సంక్రాంతి కార్యక్రమంలో పాల్గొనరావలసిందని యువజనసంఘం గూడెపు యువకుల్ని ఆహ్వానించింది. గూడెపు పెద్దలు అడ్డుచెప్పబోయారు. కాని నిర్మాణకార్యక్రమ బలమే హెచ్చయింది. గూడెపు యువకులు కూడ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

తాలూకాలో అనేకచోట్ల గ్రామ, గూడెం యువకులు కలసిమెలసి ఆటలపోటీలు జరిపారు. వందలకొలది ప్రజల్ని కోడిపందేలు, జూదాలనుండి మరల్చారు. మొత్తం 7 ప్రదేశాల్లో కార్యక్రమం జరిగింది.

గన్నవరం తాలూకాలో 11 ప్రాంతాల్లోను, బెజవాడ తాలూకాలో 9 ప్రాంతాల్లోను, బెజవాడపట్నంలోరెండుపేటల్లోను, బందరుతాలూకాలో 4 ప్రాంతాల్లోను. (మిగతా 5 వ పేజీ)

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE